సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:310 | హైదరాబాద్ 13 జూన్ 2026, శనివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-310 | Hyderabad 13 June 2026, Saturday | Pages: 8, Rs. 5/-




## థాయ్‌లాండ్ యువరాణి కన్నుమూత

సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో పోరాడుతున్న థాయ్‌లాండ్ యువరాణి బజ్రకితియాభా మహిదోల్ తుదిశ్వాస విడిచారు. దాదాపు మూడేళ్లపాటు కోమాలో ఉన్న ఆమె బ్యాంకాక్‌లోని కింగ్ చులాలోంగ్‌కార్న్ మెమోరియల్ ఆసుపత్రిలో కన్నుమూశారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## భారత నౌకల జోలికొస్తే... ఊరుకోం

### ఇరాన్ కు ట్రంప్ హెచ్చరిక...

ఆ దాడులను అడ్డుకుంది మా బలగాలే..

ఇరాన్‌తో ఎలాంటి డీల్ కుదరలేదన్న ట్రంప్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఒమన్ తీరంలో భారతీయులున్న మూడు వాణిజ్య నౌకలపై దాడులు చేసింది ఇరానేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. హర్మ్యాజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న భారత నౌకలపై అమెరికా సైన్యమే దాడులు చేస్తోందంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ దాడులు చేసింది తాము కాదని, ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడుతుంటే అమెరికా సైనిక దళాలే వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నాయని తన 'ట్రూత్ సోషల్' ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఒమన్ తీరంలో గత నాలుగు రోజుల్లో మూడుసార్లు జరిగిన ఈ దాడుల్లో ముగ్గురు భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. భారత నౌకలను లక్ష్యంగా చేసుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇరాన్ ఇప్పటికైనా ఇటువంటి చర్యలను మానుకోవాలని ట్రంప్ హెచ్చరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## బీజేపీకి కిమ్, గాడ్సేలే ఆదర్శం

### సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

పవన్ కళ్యాణ్ పై కీలక వ్యాఖ్యలు

హిట్లర్ తనకు ఆదర్శం కాదని స్పష్టం

కేబినెట్ విస్తరణపై క్లారిటీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ , ఆ పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూర్తిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డైరెక్షన్‌లో పనిచేస్తున్నారని, రాష్ట్రానికి నిధులు రాకపోవడానికి , ప్రాజెక్టులు ఆగిపోవడానికి ఆయనే ప్రధాన కారణమని సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛ ఉందని ఆయన స్పష్టం చేశారు.

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకే నడుచుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో శుక్రవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావాల్సిన పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి ప్రధాన కారణం కిషన్ రెడ్డే అని ఆయన ఆరోపణలు చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## మీనాక్షి నటరాజన్‌కు 'సుప్రీం'లో చుక్కెదురు



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

రాజ్యసభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మీనాక్షి నటరాజన్‌కు సుప్రీం కోర్టులో తీవ్ర నిరాశ ఎదురైంది. తన నామినేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేయడంతో గట్టి షాక్ తగిలింది. సుప్రీంకోర్టు తీర్పుపై మీనాక్షి నటరాజన్ తీవ్రంగా స్పందించారు. ఈ పిటిషన్ తిరస్కరణ కేవలం తన వ్యక్తిగత ఓటమి మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే పెద్ద దెబ్బ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయంపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని స్పష్టం చేసినప్పటికీ, రిటర్నింగ్ అధికారి తీసుకున్న ఏకపక్ష నిర్ణయం ఇప్పుడు ప్రజలందరికీ అర్థమైందని ఆమె పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...




- చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో నిరసనలు
- కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఆగ్రహం
- హామీల ఎగవేతపై వైసీపీ నాయకుల ప్రశ్నల వర్షం
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు ,ప్రజలు

## వైసీపీ పోరుబాటకు జనప్రభంజనం

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శుక్రవారం భారీ నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చింది. 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని పార్టీ వర్గాలు తెలిపాయి. చంద్రబాబు సర్కార్ అన్ని వర్గాలనూ మోసం చేసిందని, సూపర్ సిక్స్ సహా మిగిలిన హామీలకు మంగళం పాడిందని వైసీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. హామీలు అమలు చేయాలంటూ ఇప్పటికే మండల కేంద్రాల్లో మేనిఫెస్టోలు దగ్ధం చేయడంతో పాటు నియోజకవర్గాల్లో టౌన్ హాల్ సదస్సులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది.

...::: తరువాయి 4వ పేజీలో...



## ఒంటరిగానే వస్తాం... బీజేపీనే మా టార్గెట్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాజకీయాల్లో ఏ పార్టీతోనూ బీఆర్ఎస్‌కు పొత్తులు ఉండబోవని, వచ్చే ఎన్నికల్లో తమ ప్రధాన పోటీ భారతీయ జనతా పార్టీ తోనేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి తమ పార్టీ ఒంటరిగానే పోరాడుతోందని, భవిష్యత్‌లోనూ ఇదే పంథా కొనసాగుతుందని తేల్చిచెప్పారు. కాంగ్రెస్, బీజేపీలకు రాష్ట్రంలో బలమైన క్యాడర్ లేదని, కేవలం బీఆర్ఎస్‌కు మాత్రమే పటిష్టమైన నాయకత్వం, కార్యకర్తల బలం ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని, వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ రాష్ట్రంలో మూడో స్థానానికి పరిమితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా విధానాలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని, అయితే ఆయన ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు మాత్రం ఎవరికీ నచ్చడం లేదని మండిపడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## ఐదు కోట్ల ప్రజల నమ్మకానికి రెండేళ్లు

**తిరుపతి(ఏడీఎన్ఎన్)**

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారంతో రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, గత వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లిన అనేక సవాళ్లు, సంక్షోభాలు, అపరిష్కృత సమస్యలను అధిగమించి తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఐదు కోట్ల ప్రజల అపారమైన నమ్మకంతో ఏర్పడిన ఈ ప్రజా ప్రభుత్వంలో తాము ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. అధికారం అనేది ఒక బాధ్యత అని, పాలకులు ప్రజలకు సేవకులని తాము ప్రగాఢంగా నమ్ముతామని, సమాజంలోని ప్రతి వర్గం శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## రేవంత్ సర్కార్‌లో 'రైతు బీమా' బంద్



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

కాంట్రాక్టర్లకు ఇచ్చే బిల్లులను వెంటనే నిలిపివేసి, ఆ నిధులను రైతుబంధు కోసం విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, కరోనా లాంటి తీవ్ర ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు నిధులు అందించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులకు డబ్బులు ఇవ్వడానికి మనసు రావడం లేదని, ఆయనకు అధికారం మత్తెక్కిందని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. మొదటి ఏడాది రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టారని, ఆ తర్వాత విడతల్లో కేవలం మూడు ఎకరాలు, రెండెకరాల లోపు ఉన్నవారికే పరిమితం చేశారని మండిపడ్డారు. ఇలా రైతుబంధు పథకంలో దాదాపు రూ. 20 వేల కోట్లు ఎగ్గొట్టి, ఆ డబ్బుతోనే రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## మాజీ దేశాధ్యక్షుడికి 30 ఏళ్ల జైలు శిక్ష

దక్షిణ కొరియా రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. దేశంలో మార్షల్ లా విధించిన కేసులో ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌కు న్యాయస్థానం మరో భారీ షాక్ ఇచ్చింది. 2024 అక్టోబర్‌లో పొరుగు దేశమైన ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపిన కేసులో ఆయనకు అదనంగా మరో 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ దక్షిణ కొరియా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## చైనాలో భారత్ ఎండుమిర్చిపై ఆంక్షలు



భారతదేశం నుంచి చైనాకు ఎగుమతి అయ్యే ఎండుమిర్చిపై ఆ దేశం తాజాగా నిషేధం విధించింది. భారతీయ మిర్చిలో 'మిథామిడోపాస్' అనే హానికర కీటకనాశని రసాయన అవశేషాలు అంతర్జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్నాయంటూ చైనా క్వారంటైన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రసాయనం వల్ల మానవ నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందంటూ డ్రాగన్ దేశం ఆరోపిస్తోంది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## రాజ్యసభ సమరం 24 మంది ఏకగ్రీవం!



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

దేశవ్యాప్తంగా ఖాళీ అయిన 27 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అంతకంటే ముందే పోటీ లేకుండా 24 మంది అభ్యర్థులు పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన వారిలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ వంటి ప్రముఖ నేతలు ఉన్నారు. ఈ మేరకు గెలుపొందిన అభ్యర్థులందరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విన్నింగ్ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ ఎన్నికల ఫలితాలతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు మారాయి. ఎన్డీయే కూటమి బలం 16 నుంచి 19 స్థానాలకు పెరగ్గా, కాంగ్రెస్ పార్టీకి ఒక సీటు అదనంగా కలిసివచ్చి మొత్తం బలం 5కి చేరింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## డ్రగ్స్ తో పట్టుబడ్డ కేరళ మోడల్

### రూ.11.82 కోట్ల గంజాయి సీజ్..!



...::: పూర్తి కథనం 2వ పేజీలో...



## టాటాలను బెంగాల్‌కు తిరిగి తీసుకొస్తాం

**కోల్ కత్తా (ఏడీఎన్ఎన్):**

పశ్చిమబెంగాల్ పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఇందులో భాగంగానే గతంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన టాటా గ్రూప్‌ను తిరిగి బెంగాల్‌కు తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు సృష్టించడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టాన్ని తొలగిస్తాం



**దిస్పూర్ (ఏడీఎన్ఎన్):**

వచ్చే ఏడాది నాటికి ఒకట్రెండు రాష్ట్రాలు మినహా మిగిలిన ఈశాన్య ప్రాంతం మొత్తం నుండి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉపసంహరిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. అస్సాం, నాగాలాండ్ సరిహద్దుల్లో చమురు, ఖనిజ అన్వేషణను సులభతరం చేసే చారిత్రక త్రైపాక్షిక ఒప్పందం సందర్భంగా ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
13.06.2026
www.manasarkar.com



# బీజేపీకి కిమ్, గాడ్సేలే ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి....**
అంతేకాకుండా, ప్రతిష్ఠాత్మక రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా కిషన్ రెడ్డి అడ్డుపడ్డారని ఆయన గుర్తు చేశారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు సాధన కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదని, తెలంగాణ ప్రయోజనాల కోసం కనీసం ఒక్కసారైనా ప్రధాని మోదీతో ఆయన చర్చించారా అని రేవంత్ సూటిగా ప్రశ్నించారు. మొత్తంగా తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన వివక్ష చూపుతోందని సీఎం మండిపడ్డారు.

**పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ**
ఇదే సందర్భంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్కళ్యాణ్ పట్ల తమ ప్రభుత్వ వైఖరిని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణకు వచ్చేందుకు, ఇక్కడి నుంచి వెళ్లేందుకు, అలాగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఉందని ఉద్ఘాటించారు. గతంలో పవన్ తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందు వల్లే, తమ పార్టీ మంత్రులు ఆయనపై విమర్శలు చేయాల్సి వచ్చిందని సీఎం వివరణ ఇచ్చారు.

**హిట్లర్ నాకు ఆదర్శం కాదు**
తనకు నియంత హిట్లర్ ఆదర్శమని తాను ఎన్నడూ చెప్పలేదని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను విశ్వసించే వారెవరైనా హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటామని చెబుతారా? అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన సమావేశం గురించి ప్రస్తావిస్తూ.. ఆ భేటీలో ప్రధానే స్వయంగా తనను కౌగిలించుకున్నారని, తాను ఆయనను కౌగిలించుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ గురించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. బీజేపీ విధానాలపై సీఎం రేవంత్ తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పార్టీకి కేవలం గాడ్సే మాత్రమే కాకుండా ఉత్తర కొరియా నియంత కిమ్ కూడా ఆదర్శమేనని ఎద్దేవా చేశారు. బీజేపీకి కేవలం "ఓట్ చోరీ లేదా సీట్ చోరీ" చేయడం మాత్రమే తెలుసని తీవ్ర విమర్శలు చేశారు. మధ్యప్రదేశ్‌లో తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ మూడో అభ్యర్థిని బరిలో దించినప్పుడే ఆ పార్టీ దుర్బుద్ధి ఏమిటో బట్టబయలైందన్నారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం అత్యంత బాధాకరమైన అప్రజాస్వామిక చర్య అని ఆయన మండిపడ్డారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేసిన రేవంత్, బీజేపీని కరుడుగట్టిన మహిళా వ్యతిరేక పార్టీగా అభివర్ణించారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఈ కేబినెట్ విస్తరణ అంశంపై తాను ఎలాంటి చర్చలు జరపలేదని సీఎం స్పష్టం చేశారు. పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలందరూ మంత్రి పదవికి అర్హులే అయినప్పటికీ, రాజ్యాంగ నిబంధనల ప్రకారం కేవలం 17 మందికి మాత్రమే కేబినెట్‌లో అవకాశం ఉంటుందని ఆయన గుర్తుచేశారు. అందువల్ల సామాజిక, ప్రాంతీయ సమీకరణాలతో పాటు సీనియారిటీ, పార్టీ పట్ల నిబద్ధత తదితర అంశాలను లోతుగా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మంత్రుల ఎంపిక ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఐదు కోట్ల ప్రజల నమ్మకానికి రెండేళ్లు

**మొదటిపేజీ తరువాయి....**
ఈ రెండేళ్ల ప్రయాణంలో ప్రతి అడుగులో అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని 'స్వర్ణాంధ్ర' దిశగా నడిపిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా సానుకూలంగా స్పందించారు. రెండేళ్ల క్రితం ఏపీ ప్రజలు ఒక కొత్త ప్రారంభం కోసం ఎన్డీఏపై నమ్మకం ఉంచారని, అయితే వారి ముందున్న సవాళ్లు చాలా పెద్దవని గుర్తుచేశారు. రాష్ట్ర భవిష్యత్తుపై తిరిగి విశ్వాసం నింపడం అంత సులభం కాకపోయినప్పటికీ, ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో బలమైన కేంద్రరాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఏపీని తిరిగి వృద్ధి, అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. ఇంకా చేయాల్సింది చాలా ఉన్నప్పటికీ, ప్రజల్లో పునరుద్ధరించబడిన ఆశావాదం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసం తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోందని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

# ఒంటరిగానే వస్తాం... బీజేపీనే మా టార్గెట్

**మొదటిపేజీ తరువాయి....**
తమ హయాంలో నగరంలో వరద ముంపును అరికట్టేందుకు ప్రవేశపెట్టిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమాన్ని రేవంత్ సర్కార్ రద్దు చేసిందని విమర్శించారు. నగరంలో నీళ్లు నిలవకపోతే ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునే కాంగ్రెస్ నేతలు, వర్షం పడి రోడ్లు జలమయమైతే మాత్రం బీఆర్ఎస్‌దే బాధ్యత అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉన్న నగరాన్ని సక్రమంగా నిర్వహించడం చేతకాని సీఎం, 'ఫ్యూచర్ సిటీ' అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు.హైదరాబాద్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంటుపరిచిందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టును రద్దు చేశారని, ఒకవేళ బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే ఆ పనులు పూర్తయి ప్రయాణికుల ఇబ్బందులు తప్పేవని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను లాక్కోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల పేరుతో వచ్చిన హైడ్రా వ్యవస్థను చివరకు రాజకీయ బ్లాక్‌మెయిలింగ్‌కు వాడుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై మాట్లాడుతూ.. త్వరలోనే గులాబీ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర ఉంటుందని, వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక తెలంగాణ కాంగ్రెస్ నేతల హస్తం ఉందన్న మహారాష్ట్ర మంత్రి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఆ పార్టీలోని 'బ్లాక్ షీప్' ఎవరో రాహుల్ గాంధీనే తేల్చాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తీసుకురావాలని చూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చే అవకాశం ఉందన్న సమాచారం తమకుందని చెప్తూ.. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం సీట్ల వాటా ఏమాత్రం తగ్గినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. జనాభా నియంత్రణ పాటించి, దేశాభివృద్ధికి భారీగా నిధులు సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలను సీట్లు తగ్గించి శిక్షిస్తామంటే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. దేశం మొత్తం మీద కాకపోయినా, కనీసం తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీలలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

# 'కాక్రోచ్ జనతా పార్టీ' భారీ ధర్నా

**లక్నో (ఏడీఎన్ఎన్):**



పరీక్షల పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' లక్నోలో శుక్రవారం భారీ ధర్నా నిర్వహించింది. లక్నోలోని ఎకో గార్డెన్ వేదికగా జరిగిన ఈ ధర్నాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పోలి ఉన్న ఒక యువకుడు కాషాయ వస్త్రాలు ధరించి ప్రత్యక్షమవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సీఎం యోగి రూపంలో ఉన్న సదరు యువకుడు విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా నిరసనకారుల ముందు నిలబడటంతో.. మీడియా ప్రతినిధులు, పోలీసులు సైతం అతడిని ఆసక్తిగా గమనించారు. ఈ వినూత్న ఎంట్రీ ధర్నాలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ నిరసన ప్రదర్శనకు స్థానిక యంత్రాంగం, పోలీసులు అధికారికంగా అనుమతి నిరాకరించారు. నిర్వాహకులు అవసరమైన నిబంధనలను పాటించలేదని, సరైన సమన్వయం లేకపోవడం వల్లే అనుమతి ఇవ్వలేదని సీనియర్ పోలీస్ అధికారులు తెలిపారు. అయినప్పటికీ, దేశంలోని యువత భవిష్యత్తు కోసం తాము పోరాడుతామని విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సీజేపీ మద్దతుదారులు ఎకో గార్డెన్ వద్దకు భారీగా చేరుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలీసులు ఈ పరిసర ప్రాంతాలను భారీ బందోబస్తుతో ఒక కోటలా మార్చేశారు. ఈ నిరసనపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఢిల్లీ, పూణె నగరాల్లో తమ నిరసనలు విజయవంతంగా సాగాయని, ఈ క్రమంలో లక్నో నిరసన చాలా కీలకమైనదనీ పేర్కొన్నారు. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ పరీక్షలు రాసిన సుమారు కోటి మందికి పైగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్యాయానికి వ్యతిరేకంగా తాము ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నామని స్పష్టం చేశారు. ఈ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి తమకున్న ఏకైక డిమాండ్ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మాత్రమేనని, ప్రధాని నరేంద్ర మోదీకి కోటి మంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమా? లేక ఒక అసమర్థ మంత్రి ముఖ్యమా? అనేది తేల్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

# నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోంది


**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

గతేడాది తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన జరిగి నేటికి ఏడాది పూర్తయిన నేపథ్యంలో, ఈ ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా దర్యాప్తు సాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి తప్పుడు ప్రచారాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విమానయాన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి గల



ఖచ్చితమైన కారణాలను అన్వేషించే బాధ్యతను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ముమ్మరంగా కొనసాగిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర కీలక ఆధారాలను విశ్లేషించి దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని ఏఏఐబీ పేర్కొంది. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు ప్రక్రియలు ముగిసిన వెంటనే త్వరలోనే తుది నివేదికను విడుదల చేస్తామని, దాని ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోగా, 'విశ్వాస్ కుమార్' అనే వ్యక్తి ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డారు. విమానం స్థానిక హాస్టల్ భవనంపై పడటంతో మొత్తం మృతుల సంఖ్య 260కి చేరింది. కాగా, ఈ దుర్ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ ఇప్పటికే నష్టపరిహారాన్ని అందజేసింది.

# 132 అడుగుల మొబైల్ టవర్ మాయం



**పాట్నా (ఏడీఎన్ఎన్):**

సాధారణంగా దొంగలు ఇళ్లలో నగలు, రోడ్లపై వాహనాలు ఎత్తుకెళ్లడం చూస్తుంటాం. కానీ బీహార్‌లో మాత్రం ఏకంగా 132 అడుగుల భారీ మొబైల్ టవర్‌తో పాటు ఒక జనరేటర్‌ను కూడా దొంగిలించిన వింత ఘటన వెలుగుచూసింది. బక్సర్ జిల్లా పరిధిలోని దుమ్రావ్ పట్టణంలో జరిగిన ఈ భారీ చోరీ ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2010లో ఒక ప్రైవేట్ టెలికాం సంస్థ స్థానిక భూ యజమాని హరేనాథ్ యాదవ్‌తో 12 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకుని ఈ టవర్‌ను ఏర్పాటు చేసింది. అయితే, 2022లో ఒప్పందం ముగిసిన తర్వాత సదరు కంపెనీ నుంచి యజమానికి చెల్లింపులు నిలిచిపోయాయి. దీనిపై భూయజమాని కంపెనీకి పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. ఇటీవల సదరు టెలికాం కంపెనీ ప్రతినిధులు మరమ్మతుల కోసం అక్కడికి వెళ్లగా, టవర్ ఉన్న స్థలంలో ఖాళీగా ఉండటం చూసి అవాక్కయ్యారు. గత 1520 రోజుల వ్యవధిలోనే ఈ టవర్ మాయమైందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. ఈ భారీ టవర్‌ను ఎవరు, ఎలా తరలించారనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.



# మోహన్ భగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి

**లక్నో (ఏడీఎన్ఎన్):**

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ సమీపంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ప్రయాణిస్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్ ప్రెస్ రైలుపై గురువారం రాత్రి కొందరు దుండగులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన ప్రయాణిస్తున్న ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్ కిటికీ అద్దం దెబ్బతినగా, కిటికీకి అవతలి వైపు కూర్చోవడంతో మోహన్ భాగవత్‌కు ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ప్రాథమికంగా ధృవీకరించారు. ఈ దాడి ఘటనపై రంగంలోకి దిగిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), స్థానిక పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి, వారిలో ఇద్దరిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టిన భద్రతా సంస్థలు.. ఈ దాడి మోహన్ భగవత్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిందా? లేక రైల్వే ట్రాక్ సమీపంలో ఆకతాయిల పనా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నాయి

# ...'రైతు బీమా' బంద్

**మొదటిపేజీ తరువాయి....**
45 రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ, 65 రోజులు గడిచినా ఒక్క రూపాయి కూడా పడలేదని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమ పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న 'రైతు బీమా' పథకానికి ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడంతో అది నిలిచిపోయిందని, దీనివల్ల రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా సొమ్ము రావడం లేదని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంట్ పోయిందని, ఎరువుల కొరతతో పాటు వడ్లు, మక్కలు అమ్ముకోవడానికి రైతులు రోడ్లపై పడిగాపులు కాయాల్సి వస్తోందని మండిపడ్డారు. సంచులు చెదలు పడుతున్నా వడ్లు కొనే నాథుడే కరువయ్యాడని విమర్శించారు.రైతులు, ప్రజల అవసరాలను పక్కనబెట్టి ప్రభుత్వం వృథా ఖర్చులు చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ము రూ. 100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారని, అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు కేటాయిస్తున్నారని విమర్శించారు. వీటికి నిధులు ఉంటాయి కానీ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, మహిళలకు రూ. 2,500 జీవన భృతి, రూ. 4 వేల చొప్పున ఇవ్వాల్సిన పింఛన్లకు నిధులు ఉండవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల అబద్ధాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, రాష్ట్రంలో హిట్లర్ పాలనను అంతం చేయడానికి సిద్ధమయ్యారని.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# రాజ్యసభ సమరం...

**మొదటిపేజీ తరువాయి....**
ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ మూడు సీట్లను కోల్పోగా.. ఒడిశాలో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ కూడా తన స్థానాలను బీజేపీకి చేజార్చుకుంది. రాష్ట్రాల వారీగా చూస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి (టీడీపీ 3, జనసేన 1) నాలుగు సీట్లను, గుజరాత్‌లో బీజేపీ నాలుగు స్థానాలను క్లీన్‌స్వీప్ చేశాయి. కర్ణాటకలో కాంగ్రెస్ 3 స్థానాలు, బీజేపీ ఒక స్థానం దక్కించుకోగా.. మధ్యప్రదేశ్ (3), రాజస్థాన్ (2), అరుణాచల్ ప్రదేశ్ (1), మణిపూర్ (1), మహారాష్ట్ర (1), ఒడిశా (1) స్థానాల్లో ఎన్డీయే అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే మేఘాలయలో ఎన్‌పీపీ, తమిళనాడులో కాంగ్రెస్ చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రస్తుతం అందరి దృష్టి జార్ఖాండ్, మిజోరంలలో జరగబోయే మిగిలిన 3 రాజ్యసభ స్థానాలపైనే ఉంది. జార్ఖాండ్‌లోని రెండు స్థానాలకు ఇండియా కూటమి (జేఎంఎం, కాంగ్రెస్) అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నాథ్వాని బరిలో ఉండటంతో క్రాస్ ఓటింగ్ ఉత్కంఠ నెలకొంది. ఇక మిజోరంలోని ఏకైక స్థానం కోసం అధికార జడ్‌పీఎం, ఎంఎన్ఎఫ్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడుస్తోంది.



# ఆ చేదు అనుభవం వెంటాడుతోంది...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఆనాటి భయంకరమైన చేదు అనుభవం నేటికీ తనను వెంటాడుతోందని అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం నుంచి బయటపడ్డ ఏకైక ప్రయాణీకుడు విశ్వాస్ కుమార్ అన్నారు. దేశాన్ని కదిలించిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం జరిగి నేటికి ఏడాది పూర్తయింది. గత ఏడాది జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో 241 మంది ప్రయాణికులతో పాటు హాస్టల్ భవనంలో ఉన్న వారితో కలిపి మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం నుంచి అద్భుతంగా ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేశ్. బ్రిటన్‌లో నివసించే ఆయన.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసి తిరుగు ప్రయాణమవుతుండగా ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయన తన సోదరుడు అజయ్‌ను కోల్పోయారు. ప్రమాదం జరిగి ఏడాది గడిచినా తాను ఇంకా ఆ చేదు జ్ఞాపకాలు, నిద్రలేమి, ఆందోళనతో పోరాడుతున్నానని విశ్వాస్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే అయినా, తన అంతర్గత పోరాటాన్ని మాటల్లో వర్ణించలేనని, బాధిత కుటుంబాలకు అసలు ఏం జరిగిందనే నిజాలు, ప్రశ్నలకు సమాధానాలు కావాలని ఆయన డిమాండ్ చేశారు. విమానంలోని 11ఏ సీటు విరిగి కిందపడటం వల్లే తాను మంటల నుంచి తప్పించుకోగలిగానని వివరించారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన తుది దర్యాప్తు నివేదిక రావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు, విమానం కూలిపోయిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ స్పందిస్తూ.. 91 శాతం బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పూర్తి నష్టపరిహారాన్ని, 96 శాతం కుటుంబాలకు రూ.25 లక్షల మధ్యంతర పరిహారాన్ని అందించామని తెలిపింది. అయితే, దాదాపు 15 కుటుంబాలు తమ వారి వ్యక్తిగత వస్తువులను తిరిగి తీసుకోవడానికి నిరాకరించినట్లు సంస్థ వెల్లడించింది.

# డ్రగ్స్ తో పట్టుబడ్డ కేరళ మోడల్

## రూ.11.82 కోట్ల గంజాయి సీజ్..!



**త్రివేండ్రం (ఏడీఎన్ఎన్):**

బ్యాంకాక్ నుంచి ముంబయికి భారీగా డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ ఓ మోడల్ ఎయిర్‌పోర్ట్ అధికారులకు అడ్డంగా బుక్కయింది. కేరళకు చెందిన మోడల్, 2025 'మిసెస్ కేరళ' పోటీదారు హర్ష సన్నీ (28) బ్యాంకాక్ నుండి ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ అధికారులు ఆమెను అడ్డుకుని తనిఖీలు చేపట్టారు. ఆమె ట్రాలీ బ్యాగ్‌ను సోదా చేయగా 12 ప్లాస్టిక్ ప్యాకెట్లలో దాచి ఉంచిన ఆకుపచ్చని పదార్థం బయటపడింది. ఎయిర్‌పోర్టులోనే దానికి నార్కోటిక్ పరీక్షలు నిర్వహించగా అది గంజాయిగా తేలింది. స్వాధీనం చేసుకున్న 11 కేజీల గంజాయి విలువ సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిషేధిత మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసు కింద ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక ఎవరెవరు ఉన్నారు? దీనిని దేశంలో ఎక్కడికి సరఫరా చేయాలనుకున్నారు? అనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు

# భారత నౌకల జోలికొస్తే...

**మొదటిపేజీ తరువాయి...**
యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందంటూ వస్తున్న వార్తలను ట్రంప్ పూర్తిగా తోసిపుచ్చారు. రెండు దేశాల మధ్య ఎటువంటి కాల్పుల విరమణ ఒప్పందాలు జరగలేదని, ఇరాన్ అగ్రనాయకత్వం అంతర్జాతీయంగా 'ఫేక్ న్యూస్' ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇరాన్ పాలకులకు అస్సలు నిజాయతీ లేదని, వారితో చర్చలు జరపడం కూడా వృథా ప్రయాసని ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత రాజుకున్నాయి.

# మీనాక్షి నటరాజన్‌కు 'సుప్రీం'లో చుక్కెదురు

**మొదటిపేజీ తరువాయి...**

**అధికార పక్ష ఒత్తిళ్లకు ఈసీ తలొగ్గింది**
కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, అధికార పక్ష ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేస్తోందని మీనాక్షి ఆరోపించారు. తన నామినేషన్ తిరస్కరణపై వివరణ కోరేందుకు కాంగ్రెస్ ప్రతినిధులు ఈసీని సంప్రదిస్తే, 48 గంటల పాటు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు.

**న్యూఢిల్లీలో కాంగ్రెస్ భారీ 'సత్యాగ్రహం'**
ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దేశ రాజధాని న్యూఢిల్లీలో భారీ ఎత్తున 'సత్యాగ్రహ' నిరసనను చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను, ఈసీ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రతిపక్ష అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు.

# సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టాన్ని తొలగిస్తాం

**మొదటిపేజీ తరువాయి...**
ఈశాన్య ప్రాంతంలో సాయుధ బలగాల చట్టం అమలులో ఉన్న ప్రాంతాలు క్రమంగా తగ్గిపోవడం అక్కడ శాంతి పరిఢవిల్లుతోందనడానికి నిదర్శనమని అమిత్ షా పేర్కొన్నారు. 2019 నుండి ఇప్పటివరకు వివిధ మిలిటెంట్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య 12 ఒప్పందాలు కుదిరాయని.. వీటి ఫలితంగా ఈ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు 80 శాతం మేర తగ్గాయని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఈ చట్టాన్ని పూర్తిగా తొలగించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అస్సాం, నాగాలాండ్ మధ్య గత మూడు దశాబ్దాలుగా ఉన్న అధికార పరిధి వివాదాల వల్ల ఇక్కడ ఖనిజాన్వేషణ నిలిచిపోయిందని హోంమంత్రి తెలిపారు. తాజా త్రైపాక్షిక ఒప్పందంతో ఈ అడ్డంకులు తొలగిపోయాయని, ఫలితంగా ప్రస్తుతం వస్తున్న 1,000 నుండి 1,500 బ్యారెళ్ల చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని పదింతలు పెంచే అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఒకే ఒక్క చమురు క్షేత్రం నుండి సుమారు రూ.15 వేల కోట్ల విలువైన చమురు వెలువడే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. నాగాలాండ్‌లోని చమురు నిక్షేపాలను పూర్తిస్థాయిలో వెలికి తీయగలిగితే, దేశ ఇంధన అవసరాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి గణనీయంగా తగ్గుతుందని అమిత్ షా పేర్కొన్నారు. ఈ చారిత్రక ఒప్పందం దేశ ప్రగతిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, అభివృద్ధి చెందిన ఈశాన్య భారతం కోసం ప్రధాని నరేంద్ర మోదీ కన్న కలలను సాకారం చేయడానికి ఉన్న చివరి అవరోధం కూడా దీనితో తొలగిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు

# టాటాలను బెంగాల్‌కు తిరిగి తీసుకొస్తాం

**మొదటిపేజీ తరువాయి...**
గతంలో సింగూర్, నందిగ్రామ్ ప్రాంతాల్లో జరిగిన భూసేకరణ ఆందోళనలు, తప్పులను తమ ప్రభుత్వం ఎంతమాత్రం పునరావృతం చేయబోదని సీఎం హామీ ఇచ్చారు. నాడు జరిగిన పొరపాట్ల వల్ల రాష్ట్ర పారిశ్రామిక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు. ఈసారి రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సామరస్యపూర్వక వాతావరణంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

**17 ఏళ్ల తర్వాత సింగూర్ వివాదానికి తెర**
2006లో హుగ్లీ జిల్లా సింగూర్‌లో టాటా మోటార్స్ 'నానో' కార్ల తయారీ ప్రాజెక్ట్ కోసం అప్పటి వామపక్ష ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. అయితే, బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ నేతృత్వంలో జరిగిన తీవ్ర నిరసనల కారణంగా 2008 అక్టోబరులో టాటా సంస్థ బెంగాల్‌ను వీడి గుజరాత్‌కు తరలివెళ్లిపోయింది. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ టాటా గ్రూప్ పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించడం ద్వారా బెంగాల్ అభివృద్ధికి సరికొత్త బాటలు వేస్తామని సువేందు అధికారి ఆశాభావం వ్యక్తం చేశారు.



## ప్రధానితో విభేదాలు.. రక్షణ మంత్రి రాజీనామా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బ్రిటన్‌లోని ప్రధాని కీర్ స్టార్మర్ లేబర్ ప్రభుత్వానికి కోలుకోలేని భారీ ఎదురుదెబ్బ తగిలింది. రక్షణ నిధుల కేటాయింపులపై ప్రధానితో తలెత్తిన తీవ్ర విభేదాలతో రక్షణ మంత్రి జాన్ హీలీ గురువారం తన పదవికి రాజీనామా చేయడంతో సంక్షోభం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా భద్రతా పరిస్థితులు వేగంగా దిగజారుతున్నప్పటికీ బ్రిటన్ సైన్యానికి తగిన స్థాయిలో బడ్జెట్ కేటాయించడం లేదని ఆరోపిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రధాని స్టార్మర్‌కు పంపిన ఘాటు లేఖలో హీలీ తన తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. "నేను ఎప్పుడూ రాయాలని అనుకోని లేఖ ఇది.. తీవ్ర విచారం, ఇష్టంలేకుండానే ఈ నిర్ణయం తీసుకుంటున్నాను" అని పేర్కొన్నారు. వ్యూహాత్మక రక్షణ సమీక్షలో ప్రతిపాదించిన 'డిఫెన్స్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్' అమలుకు ప్రధాని కార్యాలయం, ఆర్థిక శాఖ కేటాయించిన నిధులు దేశ భద్రతా అవసరాలకు ఏమాత్రం సరిపోవని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రణాళిక ప్రకారం రక్షణ వ్యయం 2030 నాటికి జీడీపీలో కేవలం 2.68 శాతానికి మాత్రమే చేరుతుందని, రష్యా నుంచి పొంచి ఉన్న ముప్పును ఎదుర్కొనేందుకు ఇది ఏమాత్రం చాలదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత వైఖరి వల్ల విధుల్లో ఉన్న సైనికుల సన్నద్ధత దెబ్బతింటుందని హెచ్చరించారు. గత కొన్ని నెలలుగా రక్షణ శాఖకు, ఆర్థిక శాఖకు మధ్య నిధుల విషయంలో బిలియన్ల పౌండ్ల లోటుపై తీవ్ర ఘర్షణ నడుస్తోందని, ఈ క్రమంలో సైన్యాధిపతి సైతం ప్రధానికి లేఖ రాశారని వెల్లడైంది. ఇప్పటికే ఎంపీల తిరుగుబాటు, ఎప్‌స్టీన్ వ్యవహారంతో అల్లాడుతున్న స్టార్మర్ ప్రభుత్వానికి, సొంత కేబినెట్ నుంచే ఎదురైన ఈ తిరుగుబాటు బ్రిటన్ రాజకీయాల్లో తీవ్ర సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల వేళ జరిగిన ఈ రాజీనామా అంతర్జాతీయంగా చర్చనీయాంశం కాగా.. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని ఉధృతం చేశాయి.



## హిజ్బుల్లా ఉగ్రవాదులను హతమార్చాం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తమ సైన్యం ఇప్పటివరకు దాదాపు 10 వేల మంది హిజ్బుల్లా ఉగ్రవాదులను మట్టుబెట్టిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో కుదిరిన శాంతి ప్రతిపాదనలను సైతం పక్కనబెట్టి ఇజ్రాయెల్ రక్షణ దళాలు లెబనాన్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడుతున్నాయి. తాజాగా దక్షిణ లెబనాన్‌లోని మర్జాయూన్ జిల్లా పరిధిలో ఇజ్రాయెల్ వైమానిక దళం బాంబుల వర్షం కురిపించింది. డిబిన్ నగరం సమీపంలోని వ్యవసాయ క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. దీనికితోడు నబాతియే జిల్లాలోని జెబ్చిత్ గ్రామంపై కూడా ఇజ్రాయెల్ డ్రోన్లతో భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదని, అయితే కొందరు మరణించి ఉండవచ్చని లెబనాన్ మీడియా పేర్కొంది.ఈ పరిణామాల మధ్య నెతన్యాహు ఈ నెల 10న ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తమ పోరాటం కేవలం హిజ్బుల్లాతోనేనని, లెబనాన్ సామాన్య ప్రజలతో కాదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ కరడుగట్టిన ఆదేశాలను పాటిస్తూ హిజ్బుల్లా మొత్తం లెబనాన్ దేశాన్ని బందీగా మార్చిందని, అందువల్లే అక్కడి పరిస్థితులు తీవ్రంగా దిగజారిపోయాయని నెతన్యాహు ఆవేదన వ్యక్తం చేశారు. మునుపటి కంటే ఇజ్రాయెల్ ఇప్పుడు సైనికంగా చాలా బలంగా మారిందని, ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. తాము లెబనాన్‌తో శాంతినే కోరుకుంటున్నామని, అయితే ఆ శాంతి స్థాపనకు హిజ్బుల్లానే అతిపెద్ద అడ్డంకిగా మారిందని విమర్శించారు. ప్రాంతీయ భవిష్యత్తు బాగుండాలంటే ఆ ఉగ్రమూకలను ఎవరూ నమ్మవద్దని ఆయన లెబనాన్ ప్రజలకు పిలుపునిచ్చారు.



## సూడాన్‌లో డ్రోన్ దాడి.. 15 మంది మృత్యువాత


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఆఫ్రికా దేశమైన సూడాన్‌లో అంతర్యుద్ధం రోజురోజుకూ మరింత భీభత్సంగా మారుతోంది. అధికారం కోసం అక్కడి అధికారిక సైన్యం, పారామిలటరీ దళాల మధ్య మూడేళ్లుగా సాగుతున్న ఆధిపత్య పోరులో ఏ పాపమూ తెలియని సామాన్య ప్రజలు బలైపోతున్నారు. తాజాగా బుధవారం రాత్రి సూడాన్‌లోని కీలకమైన 'ఎల్ ఒబెయిద్' నగరంలో జరిగిన భీకర డ్రోన్ దాడులు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. నివాస ప్రాంతాలే లక్ష్యంగా జరిగిన ఈ ఘోర దాడిలో కనీసం 15 మంది పౌరులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, డజన్ల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. బాంబుల ధాటికి స్థానిక శ్మశాన వాటికలు సైతం ధ్వంసమవ్వడం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం.. ఎల్ ఒబెయిద్ నగరంలోని మార్కెట్లు, జనాభా ఎక్కువగా ఉండే వీధులపై డ్రోన్ల ద్వారా వరుసగా బాంబుల వర్షం కురిపించారు. ఈ ఆకస్మిక దాడులతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ప్రాణ భయంతో పరుగులు తీశారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మూడు సంవత్సరాలుగా సాగుతున్న ఈ అంతర్గత ఘోరకలి ఉపాధి, ఆహారం లేక అల్లాడుతున్న సూడాన్ ప్రజలను మరిన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతోంది. ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, లక్షలాది మంది శరణార్థులుగా మారుతున్నా.. అంతర్జాతీయ సమాజం ఈ సంక్షోభాన్ని అడ్డుకోవడంలో విఫలమవుతోందని మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## మాజీ దేశాధ్యక్షుడికి 30 ఏళ్ల జైలు శిక్ష

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దక్షిణ కొరియా రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. దేశంలో మార్షల్ లా విధించిన కేసులో ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌కు న్యాయస్థానం మరో భారీ షాక్ ఇచ్చింది. 2024 అక్టోబర్‌లో పొరుగు దేశమైన ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపిన కేసులో ఆయనకు అదనంగా మరో 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ దక్షిణ కొరియా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కిమ్ జోంగ్ ఉన్ సేనను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేందుకే యూన్ సుక్ యేల్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయమూర్తి స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకోవడానికి, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడానికి, దేశంలో అనియంత్రిత అధికారాన్ని చెలాయించడానికి ఆయన విధించిన 'మార్షల్ లా' ఘోరంగా విఫలమైందని కోర్టు పేర్కొంది. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ఒక సాకును సృష్టించుకోవడానికే ఆయన ఈ డ్రోన్ల చర్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.




ఈ కేసులో కేవలం మాజీ అధ్యక్షుడే కాకుండా, ఆయనకు సహకరించిన పలువురు ఉన్నతాధికారులపై కూడా కోర్టు కఠిన చర్యలు తీసుకుంది. మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్‌డేలను సైతం న్యాయస్థానం దోషులుగా నిర్ధారించి, వారికి జైలు శిక్షలు ఖరారు చేసింది. దేశంలో కృత్రిమంగా అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసమే, ఉత్తర కొరియాను రెచ్చగొట్టేలా వీరంతా సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని న్యాయస్థానం తీవ్రంగా విమర్శించింది. ఉత్తర కొరియా అంతకుముందు తమ దేశంపైకి చెత్త బెలూన్లను పంపి కచ్చితంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని, దానికి తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు డ్రోన్లను పంపారని యూన్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించినప్పటికీ ఫలితం లేకపోయింది.గత రికార్డులను పరిశీలిస్తే.. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనే నెపంతో 2024 డిసెంబరులో అప్పటి అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తమవ్వడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పార్లమెంటులో అభిశంసనకు గురై అవమానకర రీతిలో పదవిని కోల్పోయారు. అనంతరం నమోదైన కేసుల్లో దోషిగా తేలి ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. తాజా తీర్పుతో ఆయన ఇప్పట్లో జైలు నుంచి బయటకు వచ్చే అవకాశాలు పూర్తిగా మూసుకుపోయాయి.

## గ్లోబల్ వార్మింగ్ కోరల్లో 'గాడ్జిల్లా ఎల్‌నినో'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచం ఇప్పటికే అల్లాడుతున్న భూగోళానికి వాతావరణ నిపుణులు మరో తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ చూడని రీతిలో అత్యంత భయంకరమైన, శక్తిమంతమైన 'ఎల్‌నినో' వాతావరణ ప్రక్రియ ముంచుకొస్తోందని అమెరికాకు చెందిన జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ వెల్లడించింది. సాధారణంగా వచ్చే ఎల్‌నినోల కంటే దీని తీవ్రత ఊహకందని స్థాయిలో ఉండబోతుండటంతో.. వాతావరణ శాస్త్రవేత్తలు దీనికి 'గాడ్జిల్లా ఎల్‌నినో' అని నామకరణం చేశారు. పసిఫిక్ మహాసముద్ర గర్భంలో సంభవిస్తున్న ఈ అసాధారణ మార్పుల వల్ల ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వినాశకర ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ముప్పు ఉందని నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు చల్లగా ఉంటాయి. కానీ, ప్రస్తుత ప్రత్యేక పరిస్థితుల వల్ల సముద్ర అంతర్భాగంలోని వేడి నీరు అత్యంత ఉధృతంగా ఉపరితలం




వైపునకు దూసుకొస్తూ జలాలను అసాధారణంగా వేడెక్కిస్తోంది. ఈ ఏడాది చివరలో ఈ వాతావరణ పోకడ గరిష్ఠ స్థాయికి చేరి, తీవ్ర రూపం దాల్చనుందని 'నోవా' గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 1950వ సంవత్సరం తర్వాత భూమిపై నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోల్లో ఇది ఒకటిగా నిలిచేందుకు 63 శాతం అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు లెక్కగట్టారు. శిలాజ ఇంధనాల మితిమీరిన వినియోగం, పర్యావరణ కాలుష్యం కారణంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోగా, ఇప్పుడు తోడవుతున్న 'గాడ్జిల్లా' వాతావరణ సమతుల్యతను పూర్తిగా దెబ్బతీసి, మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి వేడికి దారితీయనుంది.ఈ ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా రుతుపవనాల గమనం పూర్తిగా తలకిందులు కానుంది. ఫలితంగా కొన్ని దేశాల్లో ఊహించని రీతిలో భారీ వర్షాలు, ముంచెత్తే వరదలు సంభవిస్తే.. మరికొన్ని ప్రాంతాల్లో వర్షపాతం దారుణంగా పడిపోయి తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది. ఈ ఆకస్మిక మార్పులు ప్రపంచ వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసి, తీవ్ర ఆహార సంక్షోభానికి (ఆహార భద్రతకు ముప్పు) దారితీస్తాయని విశ్లేషిస్తున్నారు. విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ మరణాలు, అంటువ్యాధులు పెరిగి ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతినడమే కాకుండా.. సముద్రపు నీరు వేడెక్కడం వల్ల జలచరాలు అంతరించిపోయి మత్స్య పరిశ్రమ, చేపల వేటపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని అంతర్జాతీయ సమాజాన్ని శాస్త్రవేత్తలు అప్రమత్తం చేశారు.

## పెంటగాన్‌లో లాక్‌డౌన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్'లో తీవ్ర కలకలం రేగింది. భవనంలో ప్రమాదకర రసాయన లేదా జీవసంబంధ పదార్థాలు ఉన్నాయనే అనుమానాలతో భద్రతా అధికారులు గురువారం హై అలర్ట్ ప్రకటించారు. గాలి నాణ్యతను పర్యవేక్షించే అంతర్గత రక్షణ వ్యవస్థలు అసాధారణ మార్పులను గుర్తించడమే ఇందుకు కారణమని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ ధృవీకరించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు తక్షణమే అత్యవసర భద్రతా ప్రొటోకాల్స్ ను అమలులోకి తెచ్చారు. భవనంలోని రెండో అంతస్తు నుంచి ఐదో అంతస్తు వరకు, అలాగే నాలుగో కారిడార్ నుంచి ఏడో కారిడార్ మధ్య ఉన్న కీలక విభాగాలను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న కొంతమంది సిబ్బందిని అత్యవసరంగా వెలుపలికి తరలించగా, మరికొన్ని విభాగాల ఉద్యోగులకు వారున్న చోటనే సురక్షితంగా ఉండాలంటూ 'షెల్టర్ ఇన్ ప్లేస్' ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన భవనాల్లో ఒకటిగా భావించే పెంటగాన్‌లో ఈ తరహా అత్యవసర పరిస్థితి తలెత్తడం అమెరికా భద్రతా వర్గాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది.పరిస్థితి తీవ్రత దృష్ట్యా పెంటగాన్ ఫోర్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి చెందిన ప్రమాదకర పదార్థాల నిరోధక ప్రత్యేక విభాగం రంగంలోకి దిగింది. వీరికి స్థానిక ఆర్లింగ్టన్ కౌంటీ ఫైర్ డిపార్ట్‌మెంట్, ఈఎంఎస్ బృందాలు కూడా తోడై భవనంలో విస్తృతంగా గాలి నాణ్యత పరీక్షలు నిర్వహించాయి. ఈ తనిఖీల సమయంలో కొందరు భద్రతా సిబ్బంది గ్యాస్ మాస్కులు, రసాయన రక్షణ దుస్తులు (కెమికల్ ప్రొటెక్టివ్ సూట్లు) ధరించి కనిపించడం అక్కడి ఉద్రిక్త



వాతావరణానికి అద్దం పట్టింది. సుమారు రెండు గంటల పాటు సాగిన క్షుణ్ణ విచారణ, సాంకేతిక పరీక్షల తర్వాత భవనంలో ఎలాంటి ప్రమాదకర పదార్థాల ముప్పు లేదని, అది కేవలం సాంకేతిక లోపం వల్ల వచ్చిన తప్పుడు హెచ్చరిక మాత్రమేనని ఇద్దరు ఉన్నతాధికారులు వెల్లడించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చినప్పటికీ, గాలి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలో లోపాలు తలెత్తడానికి గల అసలు కారణాలపై ఉన్నత స్థాయి విచారణ కొనసాగుతోంది.

## దిగుమతి సుంకాలపై ట్రంప్‌కు ఊరట

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు న్యాయస్థానంలో భారీ రిలీఫ్ లభించింది. విదేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన 10 శాతం అదనపు గ్లోబల్ సుంకాలకు వాషింగ్టన్‌లోని ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు పచ్చజెండా ఊపింది. ఈ పన్నులను చట్టవిరుద్ధమంటూ గతంలో దిగువ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ, ట్రంప్ యంత్రాంగం వాదనతో అప్పీల్స్ కోర్టు ఏకీభవించింది. దీంతో జులై 24వ తేదీ వరకు అమల్లో ఉండేలా విధించిన ఈ తాత్కాలిక సుంకాల వసూలు ప్రక్రియను యథావిధిగా కొనసాగించేందుకు ట్రంప్‌కు సర్వోన్నత మార్గం సుగమమైంది. గతంలో భారత్‌తో సహా పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన విస్తృత పన్నుల విధానాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఆ వ్యతిరేకతను అధిగమించడానికి ట్రంప్ సర్కార్ 'ట్రేడ్ యాక్ట్ 1974' లోని 'సెక్షన్ 122' (అంతర్జాతీయ చెల్లింపుల లోటు నివారణ చట్టం)ను అస్త్రంగా వాడుతూ ఈ 10 శాతం తాత్కాలిక పన్నులను అమల్లోకి తెచ్చింది.ఈ సరికొత్త సుంకాల విధింపును సవాలు చేస్తూ కొందరు వ్యాపారవేత్తలు, రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించగా.. తొలుత న్యూయార్క్‌లోని అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానం ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. "సుంకాల నిర్ణయాధికారం కేవలం పార్లమెంటు (కాంగ్రెస్)కే ఉంటుంది తప్ప అధ్యక్షుడికి లేదు" అని స్పష్టం చేసింది. అయితే ఈ ఆదేశాలపై ట్రంప్ యంత్రాంగం పైకోర్టులో అప్పీల్ చేయగా.. తాజా తీర్పుతో ప్రభుత్వం వైపే న్యాయం మొగ్గింది. ఈ పన్నుల వల్ల అమెరికాలో తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరిగి, స్థానిక పరిశ్రమలు బలోపేతం అవుతాయని శ్వేతసౌధం గట్టిగా సమర్థిస్తోంది. ఈ పరిణామాల వల్ల భారత్ వంటి దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల ధరలు గణనీయంగా పెరగనున్నాయి. ఇది భారతీయ ఎగుమతిదారులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడమే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాలను క్లిష్టతరం చేసే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## థాయ్‌లాండ్ యువరాణి కన్నుమూత

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో పోరాడుతున్న థాయ్‌లాండ్ యువరాణి బజ్రకితియాభా మహిదోల్ తుదిశ్వాస విడిచారు. దాదాపు మూడేళ్లపాటు కోమాలో ఉన్న ఆమె బ్యాంకాక్‌లోని కింగ్ చులాలోంగ్‌కార్న్ మెమోరియల్ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం కన్నుమూశారు. ఈ విషయాన్ని థాయ్‌లాండ్ రాజకుటుంబ కార్యాలయం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత రాజు మహావజిరలోంగ్‌కార్న్‌కు గల ఏడుగురు సంతానంలో ఈమె పెద్ద కుమార్తె. 2022 డిసెంబర్‌లో ఒక్కసారిగా స్పృహ కోల్పోయినప్పటి నుంచి ఆమె అపస్మారక స్థితిలోనే చికిత్స పొందుతున్నారు. 47 ఏళ్ల పిన్న వయసులోనే యువరాణి మరణించడంతో థాయ్‌లాండ్‌లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మరణవార్త విన్న వెంటనే ఆసుపత్రి ప్రాంగణానికి భారీగా చేరుకున్న ప్రజలు, యువరాణి చిత్రపటాలను పట్టుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.యువరాణి బజ్రకితియాభా థాయ్‌లాండ్ సమాజంలో సాధారణ రాజవంశీకురాలిగా కాకుండా, ప్రజల మనిషిగా విశేష ఆదరణ పొందారు. కార్నెల్ విశ్వవిద్యాలయం నుంచి చట్టశాస్త్రంలో ఉన్నత విద్య (న్యాయవాదిగా) అభ్యసించిన ఆమె, ప్రజాసేవ, న్యాయ సంస్కరణల కోసం



నిరంతరం శ్రమించారు. ముఖ్యంగా ఆమె ప్రారంభించిన 'కమ్లాంగ్‌జై' (ఇన్‌స్పైర్) అనే ప్రత్యేక ప్రచారం ద్వారా జైలు శిక్ష అనుభవిస్తున్న థాయ్ మహిళా ఖైదీల పునరావాసానికి, వారు విడుదలయ్యాక గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఎంతో తోడ్పడింది. మహిళా ఖైదీల హక్కుల కోసం ఆమె చేసిన అలుపెరగని కృషి ఫలితంగానే 2010లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 'బ్యాంకాక్ నియమాలను' ఆమోదించింది. గతంలో ఐక్యరాజ్యసమితిలో థాయ్ శాశ్వత మిషన్‌లోను, ఉడాన్ థాని ప్రావిన్స్ కు అటార్నీ జనరల్‌గాను, ఆస్ట్రియాకు థాయిలాండ్ రాయబారిగాను (2012-14) ఆమె విశిష్ట సేవలు అందించారు. 2017లో ఐక్యరాజ్యసమితి మాదకద్రవ్యాలు, నేరాల కార్యాలయానికి సద్భావన రాయబారిగా కూడా వ్యవహరించారు. యువరాణి మృతిపై థాయ్‌లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్ విరాకుల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆమె దేశానికి గర్వకారణమని కొనియాడారు. సమానత్వం, దయ, న్యాయం కలిగిన సమాజ స్థాపన కోసం ఆమె చేసిన కృషి థాయ్ ప్రజలకు ఒక నైతిక వారసత్వంగా నిలిచిపోతుందన్నారు. థాయ్‌లాండ్ రాజవంశ వారసత్వ చట్టాల్లో పురుషులకే ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఇటీవల రాజ్యాంగంలో చేసిన మార్పుల ప్రకారం ఈమె దేశానికి మొదటి మహిళా పాలకురాలయ్యే (సాంప్రదాయ మహారాణి) అవకాశాలు మెండుగా ఉన్నాయని అంతర్జాతీయ విశ్లేషకులు భావించారు. ఆమె అకాల మరణంతో సింహాసన వారసత్వ క్రమంలో ఆమె తమ్ముడు, 21 ఏళ్ల దీపంగ్ కార్న్ రస్మిజోతి ముందంజలోకి వచ్చారు. లౌకిక భావాలు, నిరాడంబరతతో రాజకుటుంబంపై ప్రజల్లో గౌరవాన్ని పెంచిన 'భా' (యువరాణి ముద్దుపేరు) మరణం థాయ్ చరిత్రలో ఒక పూడ్చలేని లోటని దేశవ్యాప్తంగా నివాళులు అర్పిస్తున్నారు.



## కథ మళ్లీ మొదటికొచ్చింది

- ఇరాన్ మళ్లీ కొత్త మెలిక
- హర్మూజ్ , యురేనియంపై యూటర్న్
- శాంతి చర్చలపై ట్రంప్ ఆశలకు గండి
- హక్కులపై రాజీపడబోమన్న ఐఆర్‌జీసీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదరబోతోందన్న తరుణంలో టెహ్రాన్ మళ్లీ కొత్త అడ్డంకి పెట్టింది. హర్మూజ్ జలసంధిపై నియంత్రణ, యురేనియం శుద్ధీకరణ హక్కుల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని ఇరాన్ స్పష్టం చేసింది. దీంతో పశ్చిమాసియా సంక్షోభం కథ మళ్లీ మొదటికొచ్చినట్లయింది. వివాదాస్పద అణు కార్యక్రమంపై ఇరాన్ వెనక్కి తగ్గిందని, ఈ వారాంతంలోనే ఐరోపా వేదికగా శాంతి ఒప్పందం ఖరారు కానుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ప్రపంచ దేశాలు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నాయి. రెండు దేశాల మధ్య ప్రతిపాదిత ముసాయిదా ఒప్పంద వివరాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఇరాన్ ఉన్నపళంగా యూటర్న్ తీసుకోవడం అంతర్జాతీయ దౌత్య వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' కథనం ప్రకారం.. ప్రస్తుతం ఖరారవుతున్న శాంతి ఒప్పంద ముసాయిదాలో హర్మూజ్ జలసంధి నిర్వహణ హక్కులను వదులుకునే ప్రసక్తే లేదని టెహ్రాన్ తేల్చిచెప్పింది. అలాగే అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందు ఉన్న యథాతథ పరిస్థితులను పునరుద్ధరించేలా ఎలాంటి నిబంధనలకూ ఇరాన్ అంగీకరించలేదని పేర్కొంది. ప్రపంచవ్యాప్త చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ అనేది పూర్తిగా ఒక ప్రాంతీయ అంశమని, దీనిపై ఇరాన్, ఒమన్ దేశాలు కలిసి ప్రాంతీయ చర్చల ద్వారా మాత్రమే నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించింది. ఇందులో బాహ్య శక్తుల లేదా పశ్చిమ దేశాల జోక్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ హర్మూజ్ పై అంతిమ నిర్ణయం తమదేనని ప్రకటించింది అణు కార్యక్రమానికి సంబంధించి కూడా ఇరాన్ తన పాత కఠిన వైఖరినే సమర్థించుకుంది. ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రాథమిక సూత్రాల పరిధిలోనే అణు చర్చలు జరుగుతాయని.. యురేనియం శుద్ధీకరణ హక్కును, ఇప్పటికే శుద్ధీకరించిన యురేనియం నిల్వలను తమ వద్దే ఉంచుకునే హక్కును తాము వదులుకోబోమని స్పష్టం చేసింది. తుది ఒప్పందంలో ఈ హక్కులు తప్పనిసరిగా భాగం కావాలని 'ఐఆర్ఎన్ఏ' నొక్కి చెప్పింది. ఇరాన్‌కు చెందిన 'మెహర్' న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. అమెరికాతో చర్చిస్తున్న ముసాయిదా ఒప్పందంలో 60 రోజుల ప్రత్యేక చర్చల వ్యవధితో పాటు, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణలకు ముగింపు పలికేలా శాశ్వత కాల్పుల విరమణ అంశం కూడా చేర్చినట్లు తెలుస్తోంది. వచ్చే వారంలో ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు ముందే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఆంక్షల సడలింపుపై ఒక అవగాహన కుదిరే అవకాశం ఉందని దౌత్య వర్గాలు భావిస్తున్నప్పటికీ, ఇరాన్ దేశ అత్యున్నత నాయకత్వం ఆమోదం తెలిపే వరకు ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం లేదని స్పష్టమవుతోంది.



## చైనాలో భారత్ ఎండుమిర్చిపై ఆంక్షలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతదేశం నుంచి చైనాకు ఎగుమతి అయ్యే ఎండుమిర్చిపై ఆ దేశం తాజాగా నిషేధం విధించింది. భారతీయ మిర్చిలో 'మిథామిడోపాస్' అనే హానికర కీటకనాశని రసాయన అవశేషాలు అంతర్జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్నాయంటూ చైనా క్వారంటైన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రసాయనం వల్ల మానవ నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందంటూ డ్రాగన్ దేశం ఆరోపిస్తోంది. గతంలోనూ భారతీయ బియ్యం ఎగుమతులపై నాణ్యతా లోపాలను సాకుగా చూపి ఆంక్షలు విధించిన చైనా.. తాజాగా మిర్చి దిగుమతులను పూర్తిగా నిలిపివేయడంతో దేశీయ వాణిజ్య వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ ఆకస్మిక నిషేధం వల్ల దేశీయ మిర్చి రైతులు, వ్యాపారులపై భారీ ప్రతికూల ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి చైనాకు దాదాపు 2.36 లక్షల టన్నుల ఎండుమిర్చి ఎగుమతి కావడం గమనార్హం. భారతీయ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్లో, ముఖ్యంగా చైనాలో అత్యంత భారీ డిమాండ్ ఉండేది. అయితే తాజా నిర్ణయంతో చైనా నౌకాశ్రయాలకు వెళ్లాల్సిన ఆర్డర్లు రద్దవడమే కాకుండా, మార్కెట్లో మిర్చి ధరలు ఒక్కసారిగా పడిపోయి రైతులకు గిట్టుబాటు ధర దక్కడం కష్టంగా మారుతుందని వాణిజ్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు. దిగుమతి చేసుకునే ఆహార పదార్థాల విషయంలో చైనా అత్యంత కఠినమైన నిబంధనలు పాటిస్తుండటంతో, భవిష్యత్తులో మన దేశీయ పంటల్లో రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని నియంత్రించి, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అందుకోవడం అత్యవసరమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## పశ్చిమ దేశాల ద్వంద్వ వైఖరిపై ఆగ్రహం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



రష్యా నుంచి ముడిచమురు కొనుగోలుపై పశ్చిమ దేశాలు చేస్తోన్న విమర్శలకు భారత కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఫిన్‌లాండ్ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. దశాబ్దాలుగా భారత ప్రధాన ప్రత్యర్థులకు ఆయుధాలు విక్రయించి, ఆ ఆయుధాలతోనే భారత్‌పై దాడులు జరుగుతున్నా పట్టించుకోని ఐరోపా దేశాలు.. ఇప్పుడు తమ ఇంధన భద్రతను ప్రశ్నించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు, వాణిజ్య విధానాల్లోని పక్షపాత, ద్వంద్వ వైఖరిని జైశంకర్ దుయ్యబట్టారు. ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత ఐరోపా దేశాలన్నీ అప్పటికప్పుడు రష్యాను వదిలేసి, భారత్‌కు సాంప్రదాయ సరఫరాదారుగా ఉన్న మధ్యప్రాచ్యం వైపు మళ్లాయని మంత్రి గుర్తుచేశారు. ఆనాటి అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్కెట్ లభ్యత, తక్కువ ధర ఆధారంగానే తమ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రష్యా చమురును కొనాల్సి వచ్చిందని ఆయన తేల్చి చెప్పారు. సార్వభౌమ దేశమైన భారత్ ఎల్లప్పుడూ తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత ఆధారంగానే స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటుంది తప్ప.. బాహ్య శక్తుల ఒత్తిళ్లకు లొంగబోదని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు.



## ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణం ఆపలేరు

**అమరావతి(ఏడీఎన్ఎన్)**

రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఎంతమంది అడ్డుపడినా, ఎన్ని కుట్రలు చేసినా ఎవ్వరూ ఆపలేరని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతి విషయంలో ప్రతిపక్షాలు నిరంతరం ఉసరవెల్లి రాజకీయాలు చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో మూడు రాజధానులంటూ కాలయాపన చేసిన వైసీపీ నాయకులు, ఇప్పుడు 'మావిగాన్' (మచిలీపట్నంవిజయవాడగుంటూరు) అనే కొత్త వింత పేరును తెరపైకి తెచ్చి మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కేవలం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే వారు ఇలాంటి వివాదాలను సృష్టిస్తూ రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. రాజధానిపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను, సృష్టిస్తున్న అడ్డంకులను రాష్ట్ర ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వారు, ఇప్పుడు కూడా అమరావతిపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నిర్దేశించుకున్న నిర్దిష్ట సమయంలోనే అమరావతి నిర్మాణాలను పూర్తి చేసి తీరుతామని ఆయన ప్రజాబాహుళ్యానికి హామీ ఇచ్చారు. అమరావతి అనేది కేవలం ఒక నగరం కాదని, అది ఆంధ్రప్రదేశ్ ఐదు కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి, భవిష్యత్తుకు ప్రతీక అని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



## జగన్ వల్లే విశాఖ ఉక్కు కుదేలు

**మంగళగిరి(ఏడీఎన్ఎన్)**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌కు చెందిన వేలాది ఎకరాల భూముల్లో లేఅవుట్లు వేసి విక్రయించాలని, ఆ నిధులతోనే ప్లాంట్‌ను నడపాలని జగన్ కేంద్రానికి ప్రతిపాదించారని మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన అధికారిక పత్రాలను కూడా ఆయన మీడియాకు ప్రదర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటానని ఇప్పుడు జగన్ చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని, ఆయన చర్యల వల్లే ప్లాంట్ ఆర్థికంగా కుదేలైందని విమర్శించారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్లాంట్‌కు అత్యంత కీలకమైన విజయనగరం జిల్లాలోని మాంగనీస్, సిలికా గనుల లీజులను ఉద్దేశపూర్వకంగానే పునరుద్ధరించకుండా అడ్డుకున్నారని పట్టాభి ధ్వజమెత్తారు. ఆ విలువైన గనులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకే జగన్ ఈ విధమైన నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ముడిసరుకు కొరత కారణంగా ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యం ఏకంగా 25 శాతం పడిపోయిందని, అలాగే శాశ్వత ఉద్యోగుల సంఖ్య కూడా 2020లో 17,000 ఉండగా, 2023 నాటికి 14,800కి తగ్గిపోయిందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని పట్టాభి తెలిపారు. నిలిచిపోయిన గనుల లీజులను వెంటనే పొడిగించడమే కాకుండా, ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏకంగా 90 శాతానికి పైగా పునరుద్ధరించామని చెప్పారు. ప్రభుత్వ తీసుకున్న సత్వర చొరవ ఫలితంగానే నష్టాల్లో ఉన్న ప్లాంట్ ప్రస్తుతం సుమారు రూ. 54 కోట్ల లాభాన్ని నమోదు చేసే స్థాయికి చేరిందని పేర్కొన్నారు. జగన్ రాసిన లేఖలే ఆయన విధ్వంసకర పాలనకు నిదర్శనమని పట్టాభిరామ్ మండిపడ్డారు.

# రాయలసీమ రాత మారుస్తాం

**తిరుపతి(ఏడీఎన్ఎన్)**

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో భారీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో కలిసి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయలసీమను 'రాయల్ సీమ'గా మార్చడమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టును చేపట్టబోతున్నామని, ఇది దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో దాడులు, కబ్జాలు, బెదిరింపులు లేని ప్రశాంత వాతావరణం నెలకొందని ఆయన పేర్కొన్నారు.ఇదే వేదికపై ప్రతిపక్ష నేత జగన్‌పై లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు 'క్రెడిట్ చోరీ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. తాము



కష్టపడి గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి సంస్థలను రాష్ట్రానికి తెస్తే, వాటిని తానే తెచ్చానని జగన్ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. జగన్ పేరులోని 'జీ' అంటే జెన్‌జీ కాదు, 'గొడ్డలి' అని, విధ్వంసమే ఆయన ఎజెండా అని విమర్శించారు. జగన్ తెచ్చినవి కేవలం మద్యం బ్రాండ్లు మాత్రమేనని ఆరోపించారు. చిన్నప్పుడు కాపీ కొడుతూ దొరికినందుకే జగన్ ఉపాధ్యాయులపై కక్షగట్టారని, మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి ఎన్నో కేసులు వేసినా తాము 150 రోజుల్లోనే 16,347 పోస్టులను భర్తీ చేశామని వివరించారు. ఇప్పుడు డీఎస్సీపై జగన్ చేస్తున్న విమర్శలు నేరుగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ప్రశ్నించడమేనన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. పెన్షన్‌ను రూ.4000కు పెంచామని, అన్నా క్యాంటీన్లు, ఉచిత బస్సు ప్రయాణం, దీపం2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలను విజయవంతంగా అందిస్తున్నామని చెప్పారు. ఏపీలో ఉన్నది సాధారణ ప్రభుత్వం కాదని, కేంద్ర సహాయంతో నడిచే 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' అని అభివర్ణించారు. దీనివల్లే విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి నిధులు సాకారమయ్యాయని, త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి కార్యకర్తలంతా అహంకారానికి పోకుండా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## నిరుద్యోగులకు జగన్ క్షమాపణ చెప్పాలి

**అమరావతి(ఏడీఎన్ఎన్)**

కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేసిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే నిరుద్యోగులకు, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పోస్ట్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల్లో అనవసరమైన ఆందోళన, భయాందోళనలు సృష్టించిన జగన్.. అభ్యర్థులందరికీ సారీ చెప్పాలన్నారు. జగన్ చేసేవన్నీ కేవలం అబద్ధపు ప్రచారాలని ఈ ఒక్క వీడియోతో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలిసిపోయిందని విమర్శించారు. తాము మొదటి నుంచీ చెప్తున్న వాస్తవాలు, గణాంకాలతోనే జగన్ ఆరోపణలను తిప్పికొట్టామని, తమ విధానాలనే కోర్టులు కూడా సమర్థించాయని పేర్కొన్నారు. ఫ్యాక్ట్ చెక్ ద్వారా అన్ని నిజాలు నిరూపితమయ్యాయని లోకేశ్ ఆ పోస్టులో స్పష్టం చేశారు.మరోవైపు విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్ లో నిర్వహించిన డీజీ ఎక్స్ ఏపీ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ లీడర్ షిప్' సదస్సుకు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. మన రాష్ట్రం నుంచి జరిగే అసలైన ఎగుమతులు కేవలం వివిధ రకాల ఉత్పత్తులు కావని, ఇక్కడి యువత నైపుణ్యమే మన నిజమైన ఎగుమతి అని అభివర్ణించారు. మెరుగైన భవిష్యత్తును నిర్మించడం కోసం రాష్ట్ర యువత నైపుణ్యాలపై పెట్టుబడి పెట్టడమే తమ ప్రభుత్వ తొలి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న యువతకు పాత తరం లేదా వెనుకటితరం సాధారణ ఉద్యోగాల కల్పన చేయడం తమ లక్ష్యం కాదని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రాబోయే రోజుల్లో సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకునేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ వంటి సరికొత్త భవిష్యత్ తరం ఉద్యోగాల సృష్టి కోసం తాము నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యారంగంలో డిజిటల్ మార్పుల ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం

**తిరుపతి(ఏడీఎన్ఎన్)**

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పు కోసమే కాదు, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభ నిర్వహించారు. ఈ వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల క్రితం ప్రజలు తమకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదని, ఒక పెద్ద బాధ్యతను అప్పగించారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని స్పష్టం చేశారు. ఈ కూటమి కేవలం అధికారాన్ని పంచుకోవడం కోసం కాదని, బాధ్యతను పంచుకోవడం కోసమే ముందుకొచ్చిందని చెప్పారు. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించడం తమపై వారు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని గుర్తుచేశారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు ఉంచిన ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎన్డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని



తెలిపారు. దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం వల్లనే ఈ నెల 9న జరగాల్సిన సభను వాయిదా వేశామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే తమ లక్ష్యమని, అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కూటమి రెండేళ్ల పాలన రాష్ట్రానికి దౌర్భాగ్యం

**తాడేపల్లి(ఏడీఎన్ఎన్)**

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందంటూ, అభివృద్ధి, సంక్షేమం పేరిట విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి పార్టీలకు సిగ్గుండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన విజయోత్సవ సభలో అన్ని అబద్ధాలే చెప్పారని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిన మహిళాశక్తి పథకానికి దిక్కులేదని, 20 లక్షల ఉద్యోగాల జాడలేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదని విమర్శించారు. మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలన్నీ సగం సగమే అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ ను సూపర్ ఫ్లాప్ చేసి, సూపర్ హిట్ అని చెప్పుకోవడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని, మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని




ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను వంచించిందని షర్మిల విమర్శించారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి, ఉన్న పెన్షన్లనే ఊడపీకారని, వడ్డీలేని రుణాలు, పేదలకు ఇళ్ల స్థలాల హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమాన్ని అటకెక్కించారని, రైతులకు సబ్సిడీలు, పంట నష్టపరిహారం ఇవ్వడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి రూ.15 వేల కోట్ల అదనపు భారం మోపారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం, జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు.కేజీ టు పీజీ ఉచిత విద్య, ప్రత్యేక అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక వసతులు, జర్నలిస్టులకు ఇళ్లు అంటూ ఇచ్చిన ప్రతి హామీ బూటకమేనని షర్మిల స్పష్టం చేశారు. విభజన హామీలను విస్మరించి, కేంద్ర నిధులపై నోరు మెదపకుండా ప్రధాని మోదీ భజన చేస్తున్నారని విమర్శించారు. మతాల మధ్య విభజన తెస్తూ, క్రిస్టియన్ మైనారిటీల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో రాష్ట్రాన్ని మరో రూ.3.50 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని, ఈ కూటమి పాలన ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన మరో దౌర్భాగ్యమని షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు.



## పొగాకు రైతులకు ఊరట

**అమరావతి(ఏడీఎన్ఎన్)**

ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. వేలం కేంద్రాల్లో పొగాకు బేళ్ల తిరస్కరణ (రిజెక్షన్లు) గణనీయంగా తగ్గడం రైతులకు పెద్ద ఊరటనిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో ఏకంగా 30 నుంచి 37 శాతంగా ఉన్న తిరస్కరణలు, ప్రస్తుతం సుమారు 20 శాతానికి తగ్గాయని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యమైన ఆంధ్రప్రదేశ్ పొగాకుకు డిమాండ్ భారీగా పెరగడమే ఈ సానుకూల మార్పునకు ప్రధాన కారణమని ఆయన వివరించారు. పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో గురువారం మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నత స్థాయి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు బోర్డు ఆధ్వర్యంలోని వేలం కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.56 కోట్ల కిలోల పొగాకు విక్రయాలు విజయవంతంగా జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పోటీ వాతావరణం రైతులకు మరింత ఆర్థిక లాభాన్ని చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాలకు ప్రతిరోజూ సుమారు 8,000 పొగాకు బేళ్లు వస్తున్నాయని, పది రోజుల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోలు కంపెనీలు అధిక సంఖ్యలో వేలంలో పాల్గొంటున్నాయని మంత్రి తెలిపారు. దీనివల్ల మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొందని చెప్పారు. ప్రకాశం, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లోని రైతుల నుంచి చివరి ఆకు వరకు, నాణ్యతకు అనుగుణంగా పూర్తి గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.



## వైసీపీ - టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

**మంత్రాలయం(ఏడీఎన్ఎన్)**

కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట వైసీపీ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం నుంచి కోసిగి వరకు వైసీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. అయితే ఈ కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మంత్రాలయం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి ఇంటి వద్దకు రాగానే ఇరు వర్గాల మధ్య వివాదం మొదలైంది. వైసీపీ నేతలు తమ ఇంటి వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడ్డారంటూ టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వైసీపీ నేతలను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఈ ఘర్షణ అంతటితో ఆగకుండా తీవ్రరూపం దాల్చి ఒక తుఫాన్ వాహనంతో పాటు రెండు బైకులకు నిప్పు పెట్టే వరకు వెళ్లింది. ఇరుపక్షాల దాడుల వల్ల వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ పరిణామంతో స్థానికంగా భయాందోళనలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెల్లాచెదురు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గ్రామంలో మళ్లీ ఎలాంటి ఘర్షణలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసులు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఇరువర్గాలను హెచ్చరించారు.

## వైసీపీ పోరుబాటకు జన ప్రభంజనం

**మొదటి పేజీ తరువాయి**

వైసీపీ అధినేత ఇచ్చిన పిలుపుమేరకు కూటమి రెండేళ్ల పాలనపై భారీ ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు కదం తొక్కాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, మహిళలకు, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని కృపాలక్ష్మి విమర్శించారు. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో కూడా వెన్నుపోటుకు రెండేళ్లు పేరిట భారీ ర్యాలీ జరిగింది. సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూక తోట రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో.. చంద్రబాబు అమలు చేయలేని హామీలతో మహిళలను, నిరుద్యోగులను, రైతులను నట్టేట ముంచారని, ఆయనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు.

**రెండేళ్లకే కూటమి ప్రభుత్వం పని అయిపోయింది: బూచేపల్లి శివ ప్రసాద్**

ప్రకాశం జిల్లాలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్లకే కూటమి ప్రభుత్వం పని అయిపోయిందని, ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే త్వరలో జనం తిరగబడతారని ఆయన హెచ్చరించారు. చంద్రబాబు, తన కొడుకు బాగుకోసమే పాలిస్తున్నారని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఏమయ్యాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన చరిత్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ది అని విమర్శించారు. మోదీని నరహంతకుడు అన్న నోటితోనే, నేడు చంద్రబాబు ఆయన జపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**నిధుల దుర్వినియోగం: దాడిశెట్టి రాజా**

తునిలో జరిగిన నిరసన ర్యాలీలో దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని ఆయన విమర్శించారు. అమరావతి పేరుతో భారీగా అప్పులు చేసి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, రాష్ట్ర అప్పులు, ఆదాయం, వ్యయాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పేరుతో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.

**కూటమికి రోజులు దగ్గరపడ్డాయి:పేర్ని కిట్టు**

మచిలీపట్నంలో పేర్ని కిట్టు మాట్లాడుతూ.. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లిందని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. మెగా డీఎస్సీ పేరుతో ఉద్యోగాలను అమ్ముకున్న నీచ చరిత్ర కూటమి ప్రభుత్వానిది అని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పెన్షన్ల మంజూరు, ఇళ్ల స్థలాల కేటాయింపు, వికలాంగుల పింఛన్లు నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు తమ శాఖలను వదిలిపెట్టి వేరే శాఖలపై జోక్యం చేసుకుంటూ ప్రభుత్వాన్ని నడపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఏ ఒక్క వైసీపీ కార్యకర్త బెదరలేదని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా నిలిపే విధంగా చివరి రక్తం బొట్టు వరకు శ్రమిస్తామని ఆయన ఉద్ఘాటించారు.

**జగన్ సీఎం అవ్వడం ఖాయం: జోగి రమేష్**

దొంగ హామీలను నమ్మి ఓటేసిన ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి జోగి రమేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన రైతాంగాన్ని నిలువునా ముంచేశారని, కనీసం మొక్కజొన్నకు రూ. 1500 గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. జగన్ హయాంలో ప్రజలు పండుగలను ఎంతో సంతోషంగా జరుపుకున్నారని, కానీ చంద్రబాబు పాలనలో ప్రజలకు రంజాన్, సంక్రాంతి, దసరా లాంటి ఏ పండుగా లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రబాబు పదే పదే వైసీపీని గొడ్డలి పార్టీ అంటున్నారని, తమది గొడ్డలి పార్టీ కాదని, చంద్రబాబుదే వెన్నుపోటు పార్టీ అని స్పష్టం చేశారు. విలువలు, విశ్వసనీయతతో పుట్టిన పార్టీ వైసీపీ అని, దమ్మున్న నాయకుడు ఉన్న పార్టీ తమదని ఉద్ఘాటించారు. వైఎస్ జగన్‌ను ఒక్కడిని ఎదుర్కోలేక ముగ్గురు కలిసి పోటీచేశారని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ కలిసి వచ్చినా ఈసారి వార్ వన్ సైడే ఉంటుందని, రాబోయేది వైసీపీ ప్రభుత్వమేనని, వైఎస్ జగన్ సీఎం అవ్వడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.తనను 83 రోజులు జైల్లో పెడితే తగ్గుతావని అనుకున్నావా అని చంద్రబాబును జోగి రమేష్ సూటిగా ప్రశ్నించారు.

**మేనిఫెస్టో పత్రాల దహనం.. చంద్రబాబును సాగనంపుతాం : చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

తిరుపతి జిల్లా చంద్రగిరిలో వైసీపీ నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చల్ల రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో పత్రాలను వైసీపీ నాయకులు దగ్ధం చేశారు. నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి లాంటి ఏ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా చంద్రబాబు ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రశ్నించారు. మోసాలు, దాడులు, భూ కబ్జాలకు కూటమి ప్రభుత్వం కేరాఫ్ గా మారిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ప్రతి కార్యకర్త పోరాడాలని, చంద్రబాబును రాష్ట్రం నుంచి సాగనంపి జగనన్నకు పట్టాభిషేకం చేసేవరకు కష్టపడతామని వారు స్పష్టం చేశారు.

**మోసగాళ్ల ప్రభుత్వం ఇది : అంబటి రాంబాబు**

గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు, అంబటికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తుంటే డీఎస్పీ అడ్డుకున్నారని, అదే టీడీపీ నాయకులు జగన్ దిష్టిబొమ్మ తగులబెడితే మాత్రం పోలీసులు రక్షణ కల్పిస్తారని రాంబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయినా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని, ముఖ్యంగా సూపర్ సిక్స్ లో ప్రధానమైనవి అసలు అమలు చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, స్త్రీ నిధి ఇవ్వలేదని, యాభై ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు పెన్షన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. లోకేష్ డీఎస్సీలో ఉద్యోగాలకు డబ్బులు తీసుకున్నారని ఆయన ఆరోపించారు.

**భయపడే వారు వైసీపీ లో లేరు : కురసాల కన్నబాబు**

కాకినాడ రూరల్ పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి సర్పవరం జంక్షన్ వరకు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. వైఎస్ జగన్‌ను ఓడించేందుకు కూటమి కట్టి, అలవికాని హామీలతో ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే ఆలోచన, శక్తి చంద్రబాబుకు లేవన్నారు. ఈ రెండేళ్లలో హామీలను సంపూర్ణంగా అమలు చేయలేదని, అమ్మకు వందనం లబ్ధిదారులను కుదించేశారని మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని విమర్శించారు. డీఎస్సీ పోస్టులను అమ్ముకున్న మిమ్మల్ని నిలదీయకపోతే తమ పార్టీకి అర్థమే లేదని, మీ కేసులకు, ఉడత ఊపులకు భయపడే వారు వైసీపీ లో ఎవరూ లేరని కన్నబాబు తేల్చిచెప్పారు.

**హామీల అమలు శూన్యం.. భారీ మూల్యం తప్పదు :కాకాణి గోవర్ధన్ రెడ్డి,**

సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజిత ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు చేసింది శూన్యమని, ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని పూర్తిస్థాయిలో ఇవ్వలేదని కాకాణి అన్నారు. చంద్రబాబుకు ఓటు వేసి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని, ఈరోజు ఎగిరెగిరి పడుతున్న వారంతా రేపు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగాయన్నారు. అటు నంద్యాల జిల్లా డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

**మోసం, మాయతో కూటమి పాలన: బొత్స**

కూటమి ప్రభుత్వం మోసం, మాయ చేసి పాలన చేస్తూ ప్రజలను వెన్నుపోటు పొడిచిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. విజయనగరం జిల్లాలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏం సాధించిందని తిరుపతిలో సభ పెట్టిందని ప్రశ్నించారు. రైతులకు యూరియాకు కార్డులు ఇవ్వడమే తప్ప యూరియా లేదని, వైసీపీ హయాంలో గ్రామాల్లో స్కూల్స్ నిర్వహణ బాగా జరిగితే, టీడీపీ దాన్ని భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. పేదలకు, మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం మోసం చేసిందని, కొత్త వారికి ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజల ఆదాయం ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో చూడాలని, ఈ ప్రభుత్వం ఒక్క క్షణం కూడా కొనసాగడానికి వీలు లేదని స్పష్టం చేశారు. వెన్నుపోటు పార్టీని ఊళ్లలోకి రానివ్వొద్దని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

**కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో నిరసనల హోరు**

కృష్ణాజిల్లా గుడివాడలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొడాలి నానితో పాటు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అటు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ పాల్గొన్నారు. ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బోసు బొమ్మ, మున్సిపల్ ఆఫీస్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు వీరు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇందులో నాలుగు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.విశాఖపట్నంలో వైసీపీ శ్రేణులు నిరసనలో పోటెత్తాయి. 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా విశాఖ నార్త్ నియోజకవర్గంలో కేకే రాజు ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. మహారాణి పార్లర్ జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం హైవే వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందంటూ, ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ వారు వినూత్నంగా స్టాల్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

**పులివెందులలో భగ్గుమన్న శ్రేణులు**

వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా పులివెందులలో వైసీపీ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసనలు జరిగాయి. వారు వైఎస్ జయమ్మ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు

# ఓటు చోరీతోనే నెహ్రూ ప్రధాని అయ్యారు

**సిద్దిపేట (ఏడీఎన్ఎన్):**



ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేటలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజే ఓటు చోరీకి పాల్పడి నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారని, అలాంటి చరిత్ర ఉన్న కాంగ్రెస్ నాయకులు నేడు ఓటు చోరీ, సీటు చోరీ గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. వారసత్వ రాజకీయాలకు, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న కాంగ్రెస్ పాలనకు.. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్న మోదీ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. బీజేపీ ఎంపీలు టైంపాస్ చేస్తున్నారన్న కాంగ్రెస్ విప్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని కొట్టిపారేసిన ఆయన, కాంగ్రెస్ ముక్త భారత్‌ను ప్రజలు కోరుకుంటున్నారని, త్వరలోనే డిలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులపై దేశ ప్రజలు తీపి కబురు వింటారని స్పష్టం చేశారు.



# సింగరేణి కార్మికులకు డిప్యూటీ సీఎం వరాల జల్లు

- మెడికల్ బోర్డు పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్!

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**

తెలంగాణ ఆర్థిక రథచక్రాలైన సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. సింగరేణి వ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డును త్వరలోనే యథావిధిగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించి కార్మిక లోకంలో హర్షం నింపారు. ఈ బోర్డును పూర్తి పారదర్శకంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు వ్యవహారాల్లో అక్రమాలకు, మధ్యవర్తుల దోపిడీకి ఆస్కారం లేకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తూ, అర్హులైన ఉద్యోగుల వారసులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేస్తూ శనివారం మంచిర్యాలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. అలాగే సింగరేణిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ప్రభుత్వం గట్టిగా ముందుకు సాగుతోందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే సింగరేణిలో రికార్డు స్థాయిలో 2,657 ఉద్యోగాలను భర్తీ చేశామని, అందులో 2,102 కారుణ్య నియామకాలు కాగా, మరో 555 ప్రత్యక్ష ఉద్యోగాలు ఉన్నాయని వివరించారు. వారసుల ప్రయోజనాల కోసం కారుణ్య నియామకాల వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పిస్తూ ప్రభుత్వం భారీ బీమా సౌకర్యాలను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగానే దాదాపు 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయంతో పాటు రూ. 10 లక్షల ఉచిత సహజ మరణ బీమాను కూడా అందిస్తున్నామని చెప్పారు. కేవలం శాశ్వత ఉద్యోగులకే కాకుండా, కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ. 40 లక్షల ప్రమాద బీమాను కల్పిస్తూ, వారికి బోనస్ కూడా చెల్లిస్తున్నామని వివరించారు. గత రెండేళ్ల కాలంలో సింగరేణి కార్మికులకు ఏకంగా రూ. 1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.సింగరేణి పరిధిలోని ఆస్పత్రులను కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ఆధునీకరిస్తున్నామని, ఇందులో భాగంగానే గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. కేవలం కార్మికుల సంక్షేమమే కాకుండా సంస్థ భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని, కొత్త బొగ్గు బ్లాకులను సాధించడం ద్వారా సింగరేణిని మరింత విస్తరించి, యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ తుది లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



# మోదీ పాలనపై ఆటోలో ఆరా

- కేంద్ర మంత్రి బండి సంజయ్ వినూత్న పర్యటన

**సిద్దిపేట (ఏడీఎన్ఎన్):**

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హుస్నాబాద్ నియోజకవర్గం రేకొండ గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఆటోలో ప్రయాణిస్తూ డ్రైవర్ దిలీప్‌తో ముచ్చటించారు. మోదీ ప్రభుత్వ పథకాలైన ఉచిత బియ్యం, గ్యాస్, రోడ్లు, గ్రామాభివృద్ధి తదితర అంశాలు పేదలకు ఎలా మేలు చేస్తున్నాయో ఆరా తీయడంతో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని సైతం ఆయన అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు రేకొండ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని ఆయన గ్రామస్తులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాను ఇంటి నుంచి తెచ్చుకున్న సద్ది మూటను విప్పి, అందరితో కలిసి నేల మీద కూర్చుని 'టిఫిన్ బైఠక్' పేరుతో అల్పాహారం చేయడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల అభివృద్ధికి బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ మొత్తంగా రూ. 25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. నేడు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కేంద్రం పిలుపు మేరకు 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం జరగనుందని, అందులో భాగంగా తాను సిరిసిల్లలో స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొంటానని మంత్రి వెల్లడించారు.

# ఛత్తీస్‌గఢ్ సీఎంతో మంత్రి ఉత్తమ్ భేటీ

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**



గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్కసారక్క బ్యారేజ్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో కీలక ముందడుగు పడిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయితో మంత్రి ఉత్తమ్, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంను మంత్రి ఉత్తమ్ కోరారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఆయనకు సమర్పించారు. కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన విభాగాల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని, కేవలం ఎన్‌వోసీ లేకపోవడం వల్లే డీపీఆర్ పరిశీలన నిలిచిపోయిందని వివరించారు. మంత్రి విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహిస్తుండగా, మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ పూర్తి సహకారం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సర్వే ఖర్చుల నిమిత్తం 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు రూ. 9.883 కోట్లు విడుదల చేశామని, ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. సర్వేలో ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములను గుర్తిస్తే, బాధితులకు చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు, అవసరమైతే ఆ మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్-2 ఆయకట్టును స్థిరీకరించే లక్ష్యంతో 2009లో దీనికి పరిపాలనా అనుమతులు రాగా, 2012లో సీడబ్ల్యూసీ సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందన్నారు. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రాజెక్టును పునఃరూపకల్పన చేసి, సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా బ్యారేజ్‌ను ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ డిజైన్ మార్పుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని ఆయన వివరించారు.సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద ఉన్న 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీని ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్‌లో 96,494, ఖమ్మంలో 85,774, వరంగల్‌లో 22,422, జనగామ జిల్లాలో 1,111 ఎకరాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. అదనంగా రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8 వేలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుందని చెప్పారు.

# సీఎం రేవంత్ విమానం దారిమళ్లింపు

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**



నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆకాశం దట్టంగా మబ్బులు కమ్మి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది నిమిషాల పాటు కురిసిన ఈ కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రధాన కూడళ్లలో వాహనాలు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నగరంలోని కూకట్‌పల్లి, అమీర్‌పేట్, ఎర్రగడ్డ, మైత్రీవనం, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, బేగంపేట, ప్యారడైజ్, ప్యాట్నీ, జేబీఎస్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం నమోదు కావడం గమనార్హం. వర్షం కారణంగా ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీకెండ్ కావడంతో సొంతూళ్లకు పయనమైన వారి సంఖ్య రోడ్లపై ఎక్కువగా కనిపించింది. ముఖ్యంగా అమీర్‌పేట్, మైత్రీవనం, కూకట్‌పల్లి వంటి రద్దీ ప్రాంతాల్లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు వర్షం దెబ్బకు తీవ్ర అవస్థలు పడ్డారు. మరోవైపు, రోడ్లపై ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో అనేకమంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయించారు. దీంతో నగరంలోని పలు ప్రధాన మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. హైదరాబాద్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుండటంతో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని అధికారులు బెంగళూరుకు మళ్లించారు. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యలో వాతావరణం ఒక్కసారిగా ప్రతికూలంగా మారింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ల్యాండింగ్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. వాతావరణం అనుకూలించకపోవడంతో అప్రమత్తమైన పైలట్.. ఏటీసీ సూచనల మేరకు విమానాన్ని భద్రతా కారణాల దృష్ట్యా బెంగళూరు విమానాశ్రయానికి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు పెద్దపీట

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**



తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు పెద్దపీట వేశామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మేధావుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రైల్వే బడ్జెట్ కింద ఏకంగా రూ.5,500 కోట్లు కేటాయించామని, ప్రస్తుతం రాష్ట్రంలో రూ.32 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులతో పాటు 5 వందే భారత్, 6 అమృత్ భారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయని వివరించారు. అలాగే, మల్కాజ్‌గిరిలో ఇండియన్ ఆయిల్ కొత్త టెర్మినల్ ప్రారంభం ద్వారా రాష్ట్ర ఇంధన అవసరాలు తీరుతున్నాయని తెలిపారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ ప్రజల బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేసిన ఆయన.. దేశాన్ని మరింత శక్తివంతంగా మార్చేందుకు, 'వికసిత భారత్' నిర్మాణంలో మోదీ నాయకత్వానికి తెలంగాణ ప్రజలు, మేధావులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.రాజకీయాల్లో నాయకుడికైనా, పార్టీకైనా అతిపెద్ద పెట్టుబడి 'విశ్వసనీయత' అని, ప్రజలకు ఇచ్చిన మాటను బీజేపీ నూటికి నూరు శాతం నిలబెట్టుకుంటోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో ఏ రోగానికి ఏ మందు కావాలో తమ దగ్గర వ్యాక్సిన్ ఉందని, అలాగే శత్రువుల భరతం పట్టేందుకు 'బ్రహ్మోస్' క్షిపణి కూడా సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన 2జీ, కామన్వెల్త్, అగస్టా వెస్ట్ ల్యాండ్ వంటి లక్షల కోట్ల కుంభకోణాల వల్ల దేశ ప్రతిష్ట మసకబారిందని, సైనికుల భద్రతను పణంగా పెట్టారని మండిపడ్డారు. కానీ, మోదీ ప్రధాని కాగానే "నేను తినను, ఎవరినీ తిననివ్వను" అని స్పష్టం చేసి అవినీతి రహిత పాలనను అందించారని కొనియాడారు. కేవలం ఎన్నికల కోసం కాకుండా భవిష్యత్ తరాల బాగోగుల కోసం ఆలోచిస్తున్నామనడానికి.. ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం నిర్మూలన, అయోధ్యలో రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి చారిత్రాత్మక నిర్ణయాలే నిదర్శనమన్నారు.యూపీఏ పాలనలో విదేశీ పెట్టుబడులు రాక దేశంలో నిరాశ నెలకొనగా, మోదీ అధికారంలోకి వచ్చాక ఏకంగా 38 దేశాలు కొత్తగా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాయని రక్షణ మంత్రి వివరించారు. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో అంతర్జాతీయ వేదికలపై భారతదేశం ఏది చెప్పినా యావత్ ప్రపంచం శ్రద్ధగా వినే స్థాయికి మన ప్రతిష్ట అనూహ్యంగా పెరిగిందని ఉద్ఘాటించారు. దేశ భద్రత కోసం రక్షణ బడ్జెట్‌ను సైతం రూ.2.5 లక్షల కోట్ల నుంచి దాదాపు రూ.8 లక్షల కోట్లకు పెంచామని, ఒకప్పుడు వెయ్యి కోట్లుగా ఉన్న రక్షణ రంగ ఎగుమతులు నేడు రూ.39 వేల కోట్లకు చేరాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఆయన.. వృథా ఖర్చులను అరికట్టేందుకు అందరినీ విశ్వాసంలోకి తీసుకుని ఒకే దేశం ఒకే ఎన్నికల విధానాన్ని కూడా కచ్చితంగా అమలు చేసి తీరుతామని కుండబద్దలు కొట్టారు.

# అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**సిద్దిపేట (ఏడీఎన్ఎన్):**



రాష్ట్రంలోని సంక్షేమ శాఖల్లో అవినీతి జరుగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావు ఎలాంటి అవగాహన లేకుండా అడ్డగోలుగా మాట్లాడి తన రాజకీయ స్థాయిని తానే తగ్గించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో మైనార్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలను వరుసగా ఆయా సామాజిక వర్గాలకు చెందిన మంత్రులే బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఈ శాఖల పరిపాలనలో పూర్తి పారదర్శకతను కాపాడేందుకు, ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా నిర్ణయాధికారాన్ని పూర్తిగా ప్రిన్సిపల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు అప్పగించామని స్పష్టం చేశారు.నాణ్యత, పారదర్శకతే ఏకైక లక్ష్యంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగినట్లే ఇప్పుడు కూడా అవినీతి జరుగుతోందనే భ్రమల్లో హరీశ్ రావు బతుకుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎంతటి భారీ అవినీతి జరిగిందో ప్రజలందరికీ బాగా తెలుసని పేర్కొన్నారు. తాము అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెప్తూ.. తాను, మంత్రి అజహారుద్దీన్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి ఉమ్మడిగా స్పష్టమైన ప్రకటన చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ శాఖల్లో ఎక్కడైనా అవినీతి జరిగిందని హరీశ్ రావు నిరూపిస్తే.. ప్రభుత్వం తరఫున ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని ఓపెన్ ఛాలెంజ్ విసిరారు.కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, ఉనికిని కాపాడుకోవడం కోసం ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీశ్ రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్య అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మాట్లాడేటప్పుడు ఆధారాలుండాలని, ఒకవేళ ఆరోపణలకు తగిన ఆధారాలు లేకపోతే హరీశ్ రావువెంటనే తన వ్యాఖ్యలను విరమించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని హితవు పలికారు.

# 'ఎస్ఐఆర్' ఒక భయంకరమైన భూతం

**ఖమ్మం జిల్లా (ఏడీఎన్ఎన్):**



కేంద్ర ప్రభుత్వం చట్టాల ముసుగులో లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తోందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా ఏదులాపురంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' అనేది అత్యంత భయంకరమైన ఒక భూతమని అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్రం తీసుకొచ్చిన ఈ దొంగ దారి ద్వారా ఇప్పటికే దేశంలోని రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను బీజేపీ ఓడించిందని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాలను టార్గెట్ చేస్తూ, ఓటర్ లిస్టు సవరణ పేరుతో దొంగతనంగా ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రక్రియలో అధికారులు ముందుగా ఓటు మ్యాపింగ్ చేస్తారని, ఆ సమయంలో గ్రామాల్లో అర్హులైన వారి ఓట్లు తొలగించకుండా బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. వివిధ సాకులు చూపుతూ ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాల్సిన పూర్తి బాధ్యత బీఎల్ఏలదేనని తేల్చిచెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అపారమైన ఆదరణ, అభిమానాన్ని కాపాడుకుంటే చాలని, కేంద్రంలోని అధికార పార్టీ దొంగ దారుల్లో లాభపడాలని చూస్తే దాన్ని అడ్డుకోవడానికి మనమందరం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.రాజ్యసభ ఎన్నికల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కేంద్రంపై పొంగులేటి మరింతగా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే.. తాము గెలవలేమని తెలిసి కూడా బీజేపీ అక్కడ అభ్యర్థిని నిలబెట్టిందని విమర్శించారు. తెలంగాణలో ఆమెపై ఎఫ్ఐఆర్ ఉందనే నెపంతో అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరింపజేశారని మండిపడ్డారు. గతంలో ఓట్లను దొంగిలించిన బీజేపీ, ఇప్పుడు ఏకంగా సీట్లనే దొంగిలించే స్థాయికి దిగజారిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకునేందుకు కేంద్ర పెద్దలు నీచమైన రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాత్రింబవళ్లు పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఈ క్లిష్ట సమయంలో మనమందరం వెన్నుదన్నుగా నిలవాలని పార్టీ శ్రేణులకు మంత్రి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న వ్యూహాత్మక కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. నియోజకవర్గాల్లోని ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిలా కష్టపడి పనిచేయాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా ప్రతి ఓటును జాగ్రత్తగా కాపాడాలని బూత్ లెవల్ ఏజెంట్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తాం

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**



తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్తులో రాబోయే అవకాశాలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో లాజిస్టిక్స్ రంగాన్ని ప్రభుత్వం ఒక కీలకమైన భాగంగా గుర్తించిందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా అనేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టులతో పాటు బాండెడ్ వేర్‌హౌసింగ్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా లాజిస్టిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలను వినియోగించుకోవడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.సాంకేతికతతో పాటు ఈ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భారీగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు.

# మీడియా రంగంలో 'లే-ఆఫ్స్' సెగ

- ఐటీ బాటలో వార్తా సంస్థలు
- కొలువులు మింగేస్తున్న 'ఏఐ' టెక్నాలజీ

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**




ఇన్నాళ్లూ కేవలం ఐటీ రంగానికే పరిమితమని భావించిన 'లేఆఫ్స్' భయం.. ఇప్పుడు తెలుగు వార్తా ప్రసార రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సమాజానికి దిశానిర్దేశం చేసే మీడియా సంస్థల్లో ఇప్పుడు సిబ్బంది తొలగింపు ప్రక్రియ జోరందుకుంది. సాంకేతిక మార్పులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకాన్ని సాకుగా చూపుతూ వివిధ మీడియా గ్రూపులు ఉద్యోగులను పక్కన పెడుతుండటంతో జర్నలిస్టు లోకంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్దిరోజుల వ్యవధిలోనే ఒకదాని తర్వాత ఒకటిగా సంస్థలు సిబ్బందిని తగ్గించుకుంటుండటం ప్రస్తుతం ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గత కొన్ని వారాలుగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన ప్రసార మాధ్యమాలలో జరుగుతున్న అంతర్గత పరిణామాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వేర్వేరు మీడియా హౌస్‌లలో ఎడిటోరియల్, సాంకేతిక , డిజిటల్ విభాగాల నుంచి ఇప్పటికే వందలాది మంది సిబ్బందికి పింక్ స్లిప్‌లు అందజేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకునే ప్రణాళికల్లో భాగంగా మేనేజ్‌మెంట్లు క్షేత్రస్థాయిలో గ్రౌండ్ వర్క్ సిద్ధం చేశాయని, రాబోయే రోజుల్లో మరికొందరిని పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో పది మందితో నడిచే ఒక విభాగాన్ని ఇప్పుడు కేవలం ఐదారుగురికే పరిమితం చేస్తుండటంతో, రోడ్డున పడుతున్న బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ తొలగింపుల జాబితాలో ఎక్కువ కాలంగా పనిచేస్తున్న సీనియర్లు, భారీ వేతనాలు తీసుకునే వారికే యాజమాన్యాలు మొదటి ప్రాధాన్యత ఇస్తుండటం గమనార్హం.తెలుగు మీడియా రంగంలోకి కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తుండటమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతంలో ఎడిటర్లు గంటల తరబడి శ్రమించి చేసే స్క్రిప్ట్ రైటింగ్, విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులను ఇప్పుడు ఏఐ సాఫ్ట్ వేర్‌లు నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తున్నాయి. డెస్క్ లో పనిచేసే సిబ్బంది కూడా ఈ ఆధునిక సాంకేతికతను వాడుతుండటంతో, సంస్థల నిర్వహణ ఖర్చులను తగ్గించుకునేందుకు యాజమాన్యాలు కొత్త లెక్కలు వేస్తున్నాయి. సాంకేతికత సాయంతో పని సులువైనప్పుడు ఎక్కువ మంది సిబ్బంది ఎందుకనే ధోరణి యాజమాన్యాల్లో పెరుగుతోంది. దీనివల్ల ప్రతి షిఫ్ట్ లోనూ మానవ వనరుల అవసరాన్ని తగ్గించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రభావం ఇప్పటికే గ్రాఫిక్స్ రంగానికి గట్టి దెబ్బ కొట్టింది. ఆటోమేషన్ టూల్స్ అందుబాటులోకి రావడంతో గ్రాఫిక్ డిజైనర్ల ఉపాధికి పెద్ద ముప్పు ఏర్పడింది.ప్రస్తుతానికి మార్కెట్‌లో ముందంజలో ఉన్న అగ్రశ్రేణి ఛానళ్లలో ఇటువంటి భారీ తొలగింపులు నేరుగా బయటకు కనిపించకపోయినప్పటికీ, అక్కడి ఉద్యోగులలో సైతం అంతర్గతంగా భయం మొదలైంది. ఎందుకంటే తెరవెనుక సాంకేతిక విభాగాలన్నింటినీ పూర్తిస్థాయి ఆటోమేషన్ పరిధిలోకి తీసుకురావడానికి సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ డిజిటల్ విప్లవం పూర్తిస్థాయిలో అమలైతే భవిష్యత్తులో తమ సీటు ఉంటుందో లేదోనన్న ఆందోళన ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. సాఫ్ట్‌వేర్ రంగాన్ని వణికించిన లేఆఫ్స్ సంక్షోభం.. ఇప్పుడు తెలుగు మీడియా రంగాన్ని ఎటు వైపు తీసుకెళ్తుందో, ఇంకెంతమంది జర్నలిస్టుల జీవితాలను ప్రభావితం చేస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. – **కృష్ణ కూమార్**



# జిమ్‌లలో స్టెరాయిడ్ల ముప్పు

- సీపీ సజ్జనార్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్ నగరంలోని జిమ్‌లలో అక్రమంగా అనాబాలిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్ల విక్రయాలు, వినియోగం వేగంగా పెరుగుతుండటం పట్ల గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. త్వరగా కండలు పెంచుకోవాలని యువతను కొందరు ట్రైనర్లు, కోచ్‌లు ప్రోత్సహిస్తున్నారని, అయితే వైద్యుల పర్యవేక్షణ లేకుండా వీటిని వాడటం వల్ల గుండె, కాలేయం, హార్మోన్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ అక్రమాలను కట్టడి చేసి, యువత ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు శుక్రవారం రాసిన బహిరంగ లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న జిమ్‌లపై ప్రత్యేక దాడులు నిర్వహించి, స్టెరాయిడ్ మాఫియాపై నిఘా ఉంచాలని, అలాగే అక్రమ సరఫరాదారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

## రాశి ఫలాలు

**13-06-2026 శనివారం**

**మేషం:**
కొత్త పనులకు శ్రీకారం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. కీలక నిర్ణయాలు. కుటుంబసభ్యులతో వివాదాల పరిష్కారం. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో కొత్త ఆశలు.

**వృషభం:**
ఆధ్యాత్మిక చింతన. వ్యవహారాలు మందగిస్తాయి. ధనవ్యయం. కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

**మిథునం:**
పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ధనలాభం. నూతన ఉద్యోగయోగం. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. వృత్తి, వ్యాపారాలు ఆశాజనకం.

**కర్కాటకం:**
ఆకస్మిక ధనలాభం. పనులు సజావుగా సాగుతాయి. బంధువుల కలయిక. విందువినోదాలు. ఇంటర్వ్యూలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి..

**సింహం:**
వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు. ధనవ్యయం. కుటుంబసభ్యులతో వివాదాలు. ఆరోగ్యభంగం. శ్రమాధిక్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

**కన్య:**
చేపట్టిన కార్యక్రమాలు మందగిస్తాయి. వ్యయప్రయాసలు. మిత్రులతో స్వల్ప వివాదాలు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు.

**తుల:**
నూతన ఉద్యోగయోగం. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో పురోగతి. సంఘంలో గౌరవం. విలువైన వస్తువులు సేకరిస్తారు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.

**వృశ్చికం:**
కొత్త పనులు ప్రారంభం. శుభవార్తలు. దైవదర్శనాలు. విందువినోదాలు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు.

**ధనస్సు:**
బంధువులతో స్వల్ప వివాదాలు. ధనవ్యయం. ఆరోగ్య సమస్యలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

**మకరం:**
ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. ఆరోగ్యభంగం. శ్రమాధిక్యం. పనుల్లో జాప్యం. వృత్తి, వ్యాపారాలలో మార్పులు. ఆలయదర్శనాలు

**కుంభం:**
వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధనలాభం. విలువైన వస్తువులు సేకరిస్తారు. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. వాహనయోగం.

**మీనం:**
పనులు వాయిదా. శ్రమ పెరుగుతుంది. సన్నిహితులతో మాటపట్టింపులు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి. ఖర్చులు పెరుగుతాయి.

## తెలంగాణ ఐసెట్-2026 ఫలితాల విడుదల

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ మే 13, 14 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అధికారికంగా ఈ ఫలితాలను ప్రకటించగా, ఇందులో 91.22 శాతం ఉత్తీర్ణతతో మొత్తం 46,654 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పరీక్ష రాసిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లి తమ హాల్‌టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ , పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా తమ ర్యాంకు కార్డులను సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## ఇద్దరు పిల్లలతో ప్రాజెక్టులోకి దూకిన తండ్రి

కామారెడ్డి(ఏడీఎన్ఎన్):



కామారెడ్డి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన ఇద్దరు చిన్నారులతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌కు చెందిన కృష్ణ (32) తన కుమారుడు రక్షిత్ (8), కుమార్తె అనన్య (5)తో కలిసి నిజాంసాగర్ ప్రాంతానికి వచ్చాడు. అనంతరం ముగ్గురూ ప్రాజెక్టులోకి దూకినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందాలు గంటల తరబడి గాలింపు చేపట్టి ముగ్గురి మృతదేహాలను వెలికితీశాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కుటుంబ, ఆర్థిక లేదా ఇతర వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులను విచారించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.ఇద్దరు చిన్నారులతో కలిసి తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## వ్యవసాయ విద్యార్థులకు అండగా 'వైఎస్సార్-కేవీపీ ఫౌండేషన్'

- పీజేటీఎస్ఏయూ కు విరాళంగా రూ. 21 లక్షల ఫండ్
- ఉత్తమ విద్యార్థికి ఏటా రూ. లక్ష నగదు బహుమతి

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):




దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావు స్థాపించిన 'డాక్టర్ వై.ఎస్.ఆర్ & డాక్టర్ కె.వి.పి ఫౌండేషన్' వ్యవసాయ విద్యార్థులకు అండగా నిలిచింది. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థికి ప్రతి సంవత్సరం రూ.లక్ష నగదు బహుమతిని అందజేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ఏకంగా రూ. 21.00 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను విశ్వవిద్యాలయానికి విరాళంగా అందించింది.విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దీనితో పాటు "భారతదేశంలో వ్యవసాయ పరిశోధన, విద్యపై ప్రత్యేక దృష్టితో హరిత విప్లవానికి శ్రీమతి ఇందిరా గాంధీ చేసిన అద్భుతమైన కృషి" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ వేదికపై ఫౌండేషన్ తరపున మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఈ విరాళం చెక్కును వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య గారికి లాంఛనంగా అందజేశారు.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ శ్రీ ఎం. కోదండరెడ్డి, బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.

**మహానేత దార్శనికతకు నివాళి**

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రాల విభాగంలో విద్యాపరమైన నైపుణ్యాన్ని ప్రోత్సహించి, అర్హులైన విద్యార్థులకు మద్దతు ఇవ్వాలన్న ఫౌండేషన్ నిబద్ధతకు ఈ చొరవ అద్దం పడుతోందన్నారు. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారికి వ్యవసాయం ఎంతో ఇష్టమైన అంశమని, ఆయన ఎల్లప్పుడూ రైతుల సంక్షేమం , వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. విద్య, వ్యవసాయాభివృద్ధి ద్వారా గ్రామీణ వర్గాలను సాధికారపరచాలనే మహానేత దార్శనికతకు ఈ వ్యవసాయ శాస్త్రాల అవార్డు ఒక సరైన నివాళి అని కొనియాడారు.

## వ్యాపారమే కాదు.. సామాజిక శ్రేయస్సే 'శ్రీ సిమెంట్' లక్ష్యం

నరసరావుపేట(ఏడీఎన్ఎన్):



కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా, సామాజిక స్పృహ, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా శ్రీ సిమెంట్ సంస్థ పలు సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తోందని ఆ సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ భారతి డాద్వావాలా తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా ప్రతినిధుల సమావేశంలో కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆమె మాట్లాడారు. భారతదేశంలోనే మూడవ అతిపెద్ద సిమెంట్ ఉత్పత్తి సంస్థ అయిన 'శ్రీ సిమెంట్' సాధించిన మైలురాళ్లను, భవిష్యత్తు ప్రణాళికలను ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. 1983లో స్థాపించిన శ్రీ సిమెంట్ సంస్థ దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలో 12 ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్లతో విస్తరించి ఉందన్నారు. ప్రస్తుతం సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 70 మిలియన్ టన్నులుగా ఉంచామని, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా ముందంజలో ఉన్నామని వివరించారు.పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీ సిమెంట్ ప్లాంట్ విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని భారతి డాద్వావాలా హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 మిలియన్ టన్నులుగా ఉందని స్పష్టం చేశారు. స్థానిక నిరుద్యోగితను తగ్గించేందుకు ప్లాంట్‌లోని మొత్తం 179 మంది సిబ్బందిలో 60 శాతం ఉద్యోగ అవకాశాలను స్థానికులకే కల్పించి ప్రాధాన్యం ఇచ్చామని ఆమె వివరించారు.దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల కుటుంబాలను ఆదుకునేందుకు సంస్థ 'ప్రాజెక్ట్ నమన్' అనే వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోందని భారతి డాద్వావాలా పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సొంత ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టే అమరవీరుల కుటుంబాలకు అవసరమైన 720 సిమెంట్ సంచులను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు.దాచేపల్లి ప్లాంట్ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శుద్ధి చేసిన తాగునీటి కోసం పలు గ్రామాల్లో ఆర్.ఓ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మెరుగైన కంప్యూటర్ క్లాసులు, అధునాతన ల్యాబొరేటరీలను ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా, స్వయం ఉపాధి కోసం వారికి ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించడానికి శ్రీ సిమెంట్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రతినిధులు పునరుద్ఘాటించారు.ఈ మీడియా సమావేశంలో శ్రీ సిమెంట్ సంస్థ యూనిట్ హెడ్ అరుణ్ అగర్వాల్, కార్పొరేట్ ఎఫైర్స్ జనరల్ మేనేజర్ శ్రీధర్ రాజు, దాచేపల్లి ప్లాంట్ మేనేజర్ (యూనిట్ హెచ్ ఆర్) కె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మీనారాయణతో పాటు కంపెనీ ప్రతినిధులు జయంత్, జయప్రకాష్ యాదవ్, ఠాగూర్ , ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

## స్కూళ్లు రీఓపెన్.. విద్యార్థులకు స్వాగతం

అమరావతి(ఏడీఎన్ఎన్):




వేసవి సెలవులు ముగియడంతో ఆంధ్రప్రదేశ్‌లో శనివారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనుంది.అధికారుల సమాచారం మేరకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు వారం రోజుల పాటు కొనసాగనుంది. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా పాఠశాల స్థాయిలో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై బోధన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.ఇదిలా ఉండగా, తెలంగాణలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

**జులైలో 'తల్లికి వందనం' అమలు**

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకాన్ని జులై తొలి వారంలో అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. గత ఏడాది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేసిన ప్రభుత్వం, ఈ ఏడాది కొన్ని పరిపాలనా కారణాల వల్ల పథకం అమలులో స్వల్ప జాప్యం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

## స్మార్ట్ పోలీసింగ్.. టెక్నాలజీతో నేరాలకు చెక్


హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



సాంకేతికతను పుణికిపుచ్చుకుంటూ నేరాల స్వరూపం వేగంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో.. నేరగాళ్ల ఆటకట్టించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ కృత్రిమ మేధ ను ప్రధాన ఆయుధంగా మలచుకుంటోంది. నేర పరిశోధన, డేటా విశ్లేషణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్‌లను రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఏఐ ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనలిటిక్స్ సిస్టమ్ ద్వారా దర్యాప్తు ప్రక్రియలో సరికొత్త అధ్యాయానికి ఆయన నాంది పలికారు.సీఐడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లు ఎన్నో వినూత్న ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన స్మార్ట్ కెమెరాలు.. మాట్లాడుతున్న వ్యక్తిని ఆటోమేటిక్‌గా గుర్తించి అటువైపు తిరగడమే కాకుండా, వారిపై జూమ్ అవుతూ ఆడియో, వీడియోలను రికార్డు చేస్తాయి. మానిటర్ లేదా డిజిటల్ బోర్డుపై ఇచ్చే సమాచారాన్ని ఇట్టే గ్రహించి.. క్షణాల్లో టెక్స్ట్ , ఆడియో లేదా నివేదిక రూపంలోకి మార్చే సామర్థ్యం ఈ వ్యవస్థ సొంతం. కృత్రిమ మేధస్సు సాయంతో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి క్రైమ్ మ్యాపింగ్, డేటా ఫిల్టరింగ్, కేసుల సమీక్షలను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించడానికి ఈ ఆధునిక ల్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయి.విచారణ ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చే దిశగా, ల్యాబ్ సమావేశాల్లో చర్చించిన ప్రతి అంశాన్ని డిజిటల్ రూపంలో భద్రపరుస్తారు. ప్రధానంగా బాధితులు, ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు, అభిప్రాయాలను సైతం పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే నమోదు చేస్తారు. దీనివల్ల కేసుల పురోగతిని, దర్యాప్తు నాణ్యతను ఎప్పటికప్పుడు సమీక్షించడం దర్యాప్తు అధికారులకు సులభతరం అవుతుంది. అలాగే, సీసీటీఎన్ఎస్ వేదికపై డేటా నిర్వహణ, విశ్లేషణ, ధ్రువీకరణ తదితర ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరగనున్నాయి.ప్రారంభోత్సవం తర్వాత నిర్వహించిన సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీసుల విధి నిర్వహణలో, ముఖ్యంగా సైబర్ నేరాల కట్టడిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే మూల సూత్రమని స్పష్టం చేశారు.

## విటుడిపై ట్రాఫికింగ్ కేసు కుదరదు: హైకోర్టు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



సెక్స్ వర్కర్ సేవలు పొందిన వ్యక్తిని కేవలం 'విటుడు' అనే కారణంతో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 370 (మానవ అక్రమ రవాణా/ ట్రాఫికింగ్) కింద నిందితుడిగా పరిగణించలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే సంబంధిత మహిళ ట్రాఫికింగ్‌కు గురైన బాధితురాలని తెలిసి కూడా ఆమె సేవలను వినియోగించినట్లు నిర్ధారణ అయితే ఐపీసీ సెక్షన్ 370ఏ(2) కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. ట్రాఫికింగ్ కేసులకు సంబంధించిన 120కు పైగా క్రిమినల్ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన వ్యభిచార సంబంధిత కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురు వ్యక్తులు తమపై ట్రాఫికింగ్ చట్టం కింద కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు.విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులు, తమ క్లయింట్లు ట్రాఫికింగ్‌కు పాల్పడలేదని, కేవలం విటులుగా మాత్రమే ఉన్నారని వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఐపీసీ సెక్షన్ 370 అనేది మానవ అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులను శిక్షించేందుకు ఉద్దేశించిన నిబంధన అని స్పష్టం చేసింది.అలాగే సెక్స్ వర్కర్లను ఇతరులకు సమకూర్చడం, మధ్యవర్తిత్వం చేయడం లేదా అక్రమ రవాణాలో భాగస్వామ్యం కావడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫికింగ్ కేసులు నమోదు చేయవచ్చని పేర్కొంది.స్వచ్ఛందంగా ఈ వృత్తిలో కొనసాగుతున్న సెక్స్ వర్కర్లు, వారి విటులను పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు అనవసరంగా వేధించరాదని హైకోర్టు సూచించింది. స్వచ్ఛంద సెక్స్ వర్క్ భారత చట్టాల ప్రకారం నేరం కాదని, ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది.అదేవిధంగా, వేశ్యాగృహం లేదా వ్యభిచారం జరుగుతున్న ప్రాంతం సమీపంలో ఉన్నారనే కారణంతోనే ఒక వ్యక్తిపై సెక్షన్ 370ఏ(2) కింద కేసు నమోదు చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ట్రాఫికింగ్‌కు గురైన మహిళపై లైంగిక దోపిడీకి పాల్పడేందుకు ప్రయత్నించాడని, ఆమె ట్రాఫికింగ్ బాధితురాలని అతనికి తెలిసినట్లు నిరూపించే ఆధారాలు ఉన్నప్పుడే సంబంధిత నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది.ఈ తీర్పుతో ట్రాఫికింగ్ కేసుల నమోదుపై స్పష్టత వచ్చినట్లుగా న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే కేసుల దర్యాప్తులో చట్టబద్ధ ప్రమాణాలను పాటించాలని హైకోర్టు సూచించింది.

## 24 మంది అరెస్టుకు జేసీ డిమాండ్

తాడిపత్రి(ఏడీఎన్ఎన్):



అనంతపురం జిల్లా తాడిపత్రిలో శుక్రవారం రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి నిరసన చేపట్టి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు 24 మంది పార్టీ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో జేసీ అనుచరులు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.నిరసన సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయని ఆరోపించారు.తమ డిమాండ్ల మేరకు నిందితులపై తక్షణమే చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఇక పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు తాడిపత్రి పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కానిస్టేబుల్ పోస్టులు పెంచాలంటూ ధర్నా

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):




పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌లో ఆందోళనకు దిగారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలో వందలాది మంది అభ్యర్థులు ధర్నా నిర్వహించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ప్రస్తుతం ప్రకటించిన కానిస్టేబుల్ పోస్టుల సంఖ్య సరిపోదని పేర్కొన్న అభ్యర్థులు, వాటిని 5 వేల నుంచి 20 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు రోడ్డుపై బైఠాయించడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అభ్యర్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం రోడ్డుపై నిరసన కొనసాగిస్తున్న కొందరు అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు ప్రకటించిన పోస్టుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.అలాగే పోలీస్ నియామకాల్లో వయోపరిమితి సడలింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అమలులో ఉన్న వయోపరిమితి సడలింపులను కొనసాగించాలని, లేకపోతే అనేక మంది అభ్యర్థులు అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పోస్టుల సంఖ్య పెంచడంతో పాటు వయోపరిమితిపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి ట్రాఫిక్‌ను సాధారణ స్థితికి తీసుకువచ్చారు.

## కందుకూరులో టిప్పర్ ఢీకొని మహిళ మృతి

ఇబ్రహీంపట్నం(ఏడీఎన్ఎన్):



రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కంచర గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళను టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భారతమ్మ (45) ఆకుల మైలారం ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో కంచర గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అతి వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కాగా, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

## అమూల్య శ్రీ ఆత్మహత్య కలకలం

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



నగరంలో ఓ షార్ట్ ఫిల్మ్ నటి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వ్యక్తిగత వీడియోలను అడ్డంగా పెట్టుకుని కొందరు వ్యక్తులు వేధింపులకు పాల్పడటంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సినిమాల్లో అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చిన అమూల్య శ్రీ అనే యువతి సైదాబాద్ ప్రాంతంలో నివాసం ఉంటూ షార్ట్ ఫిల్మ్ లలో నటిస్తోంది. ఆమెకు సంబంధించిన వ్యక్తిగత వీడియోలను కొందరు వ్యక్తులు సంపాదించి, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తూ గత కొన్ని నెలలుగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆమెపై తీవ్ర మానసిక ఒత్తిడి పెరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు.వేధింపుల విషయమై అమూల్య శ్రీ పోలీసులను కూడా ఆశ్రయించినట్లు సమాచారం. అయితే ఫిర్యాదుపై సకాలంలో చర్యలు తీసుకోలేదని, నిందితులపై కఠిన చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.తీవ్ర మనస్తాపానికి గురైన అమూల్య శ్రీ సుమారు పది రోజుల క్రితం తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



# ఫిఫా ప్రపంచ కప్‌లో దక్షిణకొరియా బోణీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఫిఫా ప్రపంచ కప్‌లో ఆసియా జట్టు దక్షిణ కొరియా బోణీ కొట్టింది. చెకియాపై 21 తేడాతో విజయం సాధించింది. గ్రూప్ ఏలో తలపడిన ఇరు జట్లూ గెలుపు కోసం చివరివరకూ హోరాహోరీగా పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట టెన్షన్‌గా మారింది.

తొలి గోల్ (59వ నిమిషం): రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడిస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది.

స్కోరు సమం (67వ నిమిషం): సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిూమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లు కష్టపడ్డాయి.

గెలుపు గోల్ (80వ నిమిషం): 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 21 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు

ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. మ్యాచ్‌లో చెకియా 16 ఫౌల్స్ చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.



# 15 ఏళ్ల కుర్రాడు భారత క్రికెట్‌కు దొరికిన ఖజానా!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ క్రికెట్‌లో భారత యువకెరటం వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిస్తాడని దక్షిణాఫ్రికా మాజీ స్పీడ్‌స్టర్, దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ జోస్యం చెప్పాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు భారత క్రికెట్‌కు దొరికిన ఓ 'ఖజానా' లాంటివాడని కొనియాడాడు. క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీల కంటే వైభవ్‌లోనే ఎక్కువ సత్తా ఉందని అతడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడావర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**ఆ దిగ్గజాలను మించిపోతాడు**

"మీరంతా వైభవ్ సూర్యవంశీని చూసి సచిన్ లేదా విరాట్‌లా ఉన్నాడని భావిస్తుంటారు. కానీ, నా ఉద్దేశంలో వారిద్దరి కంటే కూడా ఇతడిలో చాలా సత్తా దాగుంది. వైభవ్ తన కెరీర్ ముగిసేసరికి ఆ దిగ్గజాలను కూడా అధిగమిస్తాడని నేను ప్రగాఢంగా నమ్ముతున్నా. ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ క్రికెటర్ల కంటే వైభవ్ చాలా బెటర్. అండర్15, అండర్19 స్థాయిలో ఎంతోమంది అద్భుతమైన ఆటగాళ్లను చూస్తుంటాం. కానీ దక్షిణాఫ్రికాలో గానీ, ఇతర దేశాల్లో గానీ వైభవ్ లాంటి నైపుణ్యం ఉన్న యువ క్రికెటర్‌ను నేను ఇంతవరకు చూడలేదు. మా దేశంలో టాలెంట్‌కు కొదవేం లేదు.. కానీ వైభవ్ లాంటి బెస్ట్ ప్లేయర్ మాత్రం లేడని కచ్చితంగా చెప్పగలను. అందుకే, అతడిని భారత జట్టుకు దొరికిన అతిపెద్ద ఖజానా అంటున్నా" అని స్టెయిన్ ప్రశంసల వర్షం కురిపించాడు.



# భారీగా పెరగనున్న కార్ల ధరలు

## జులై 1 నుంచి టాటా కార్ల ధరల పెంపు!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సొంత కారు కల నెరవేర్చుకోవాలనుకునే మధ్యతరగతి వినియోగదారులకు ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ గట్టి షాకిచ్చింది. తమ ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వచ్చే నెల (జులై 1) నుంచి కార్ల ధరలను గరిష్ఠంగా 1.5 శాతం వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది.

**అన్ని మోడళ్లకూ వర్తింపు..**

ఈ ధరల పెంపు కేవలం పెట్రోల్, డీజిల్ కార్లకే కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా వర్తించనుంది. మోడల్, వేరియంట్‌ను బట్టి ఈ ధరల సవరణ మారుతుందని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో స్పష్టం చేసింది.

**ధరల పెంపునకు కారణాలు ఇవే..**

మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ముడి సరకుల ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్లే పాక్షికంగా ఈ ధరల పెంపు నిర్ణయం తీసుకోక తప్పలేదని టాటా మోటార్స్ పేర్కొంది. అయితే, ఉత్పత్తి వ్యయాల భారాన్ని వీలైనంత వరకు సంస్థే భరిస్తోందని, వినియోగదారులపై పెద్దగా ప్రభావం పడకుండా కేవలం కొంత మొత్తం మాత్రమే బదిలీ చేస్తున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆటోమొబైల్ రంగంలో వరుసగా ధరల పెంపులు సాధారణ వినియోగదారులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ జూన్ 1 నుంచి తమ కార్ల ధరలను ఏకంగా రూ.30 వేల వరకు పెంచేసింది. ఆ ప్రకటన వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఇప్పుడు టాటా మోటార్స్ కూడా ధరల పెంపు బాట పట్టడం గమనార్హం. జులై 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్న నేపథ్యంలో, టాటా కార్లను కొనుగోలు చేయాలనుకునే వారు ఈ జూన్ నెలాఖరు లోపు బుకింగ్స్ పూర్తి చేసుకుంటే ప్రస్తుత ధరల ప్రయోజనాన్ని పొందే అవకాశం ఉంటుంది.

# షూటింగ్ దిగ్గజం జస్పాల్ రాణా మృతి

## ప్రధాని నరేంద్రమోదీ సంతాపం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత ప్రఖ్యాత షూటింగ్ దిగ్గజం, ఒలింపిక్ స్టార్ మనుబాకర్ కోచ్ కూడా అయిన జస్పాల్ రాణా (49) గుండెపోటుతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఇటీవల జర్మనీలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ముగించుకుని భారత బృందంతో కలిసి తిరిగి వస్తుండగా విమానంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. జర్మనీలో టోర్నీ సందర్భంగానే ఆయనకు ఛాతీనొప్పి, అసౌకర్యం కలగగా.. దానిని ఎసిడిటీగా పొరబడి తన పనిలో నిమగ్నమయ్యారని ఆయన సోదరుడు సుభాష్ వెల్లడించారు. విమానం ఢిల్లీలో దిగిన వెంటనే ఆయనను సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రికి తరలించి అత్యవసరంగా యాంజియోప్లాస్టీ (స్టెంట్) చేశారు. కోలుకుంటున్నారని భావించినప్పటికీ పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈ



మరణాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ధృవీకరించింది.

**క్రీడాకారుడిగా అద్భుత ప్రస్థానం:**

1990ల కాలంలో భారత షూటింగ్‌లో ఆయన తిరుగులేని శక్తిగా ఎదిగారు. 2006 దోహా ఆసియా క్రీడల్లో ప్రపంచ రికార్డును సమం చేస్తూ ఏకంగా 3 స్వర్ణ పతకాలు సాధించారు. కామన్వెల్త్ గేమ్స్ లో 9 స్వర్ణాలు సహా మొత్తం 15 పతకాలను కొల్లగొట్టారు. చిన్న వయసులోనే ప్రతిష్ఠాత్మక 'అర్జున అవార్డు'ను దక్కించుకున్నారు. రిటైర్మెంట్ అనంతరం అత్యుత్తమ షూటర్లను తయారుచేసే పనిలో నిమగ్నమైన ఆయన.. మను భాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చారు. పారిస్ ఒలింపిక్స్ లో రెండు కాంస్య పతకాలు సాధించిన స్టార్ షూటర్ మను భాకర్‌కు ఆయన వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. అద్భుతమైన అథ్లెట్లను తీర్చిదిద్దినందుకు గానూ 2020లో కేంద్ర ప్రభుత్వం ఆయనను 'ద్రోణాచార్య' అవార్డుతో సత్కరించింది. ఆయన ప్రస్తుతం 25 మీటర్ల భారత పిస్టల్ షూటింగ్ విభాగానికి హైపెర్ఫార్మెన్స్ కోచ్‌గా ఉన్నారు. జస్పాల్ రాణా మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ప్రధాని పోస్టు చేశారు.




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారతీయ స్టార్ షట్లర్ పీవీ సింధు తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తోంది. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె కనబరిచిన తీరు ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించింది. క్వార్టర్ ఫైనల్‌లో తైపీకి చెందిన 'చెన్ సు యు'తో తలపడిన సింధు, మ్యాచ్‌ను పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకుంది. తైపీ ప్లేయర్ సింధు దూకుడుకు ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వలేకపోయింది. వరుస గేముల్లో 216, 219 తేడాతో చెన్ సు యుపై సింధు అలవోకగా విజయం సాధించింది. ఈ మ్యాచ్ కేవలం 27 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. కోర్టులో సింధు కదలికలు, షాట్ల ఎంపిక ఎంత పదునుగా ఉన్నాయో ఈ సమయమే చెబుతోంది. సెమీ ఫైనల్స్ లో సింధుకు జపాన్‌కు చెందిన బలమైన క్రీడాకారిణి 'యమగుచి'తో ఆసక్తికర పోరు ఎదురుకానుంది. ఇప్పటివరకు వీరిద్దరి మధ్య జరిగిన ముఖాముఖి పోరులో సింధు 1513 రికార్డుతో ఆధిక్యంలో ఉండటం ఆమెకు మానసికంగా అదనపు బలాన్ని ఇస్తుంది. క్వార్టర్స్ లో తక్కువ సమయంలోనే మ్యాచ్ ముగించడం వల్ల సింధు సెమీస్‌కు పూర్తి ఎనర్జీతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

# 'ఫిట్టర్'లో రోహిత్ శర్మ పెట్టుబడులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ బిజినెస్ మేన్‌గా సరికొత్త అవతారం దాల్చారు. ప్రముఖ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ప్లాట్‌ఫామ్ 'ఫిట్టర్'తో తన భాగస్వామ్యాన్ని తీసుకున్నారు. గతంలో ఈ సంస్థకు తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించిన ఆయన, తాజాగా కంపెనీలో పెట్టుబడి పెట్టి ఈక్విటీ పార్టనర్‌గా మారారు. రోహిత్ శర్మ ఈక్విటీ భాగస్వామిగా చేరినట్లు ఫిట్టర్ అధికారికంగా ప్రకటించింది, అయితే పెట్టుబడి మొత్తాన్ని మాత్రం వెల్లడించలేదు. సంస్థ సీఈఓ జితేంద్ర చౌక్సీ, ఇతర బృందంతో రోహిత్



పలు దఫాలుగా చర్చలు జరిపారు. కంపెనీ వ్యాపార నమూనా, దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలను నిశితంగా పరిశీలించిన తర్వాతే ఆయన పెట్టుబడికి మొగ్గుచూపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడం ఈ పార్టనర్‌షిప్ ముఖ్యఉద్దేశమని తెలిపారు. రోహిత్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ "బలమైన పునాదులు, స్పష్టమైన లక్ష్యం ఉన్న ఈ కంపెనీలో భాగస్వామిని కావడం సరైన నిర్ణయం. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడంలో సహాయపడటం ద్వారా సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చు." అని పేర్కొన్నారు. ఈ సరికొత్త భాగస్వామ్యం తమ సంస్థ వృద్ధి ప్రయాణంలో ఒక కీలక మైలురాయి అని, ప్రజలు తమ ఆరోగ్యంపై పూర్తి నియంత్రణ సాధించేలా ఇది దోహదపడుతుందని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది.

# దేశాల జీడీపీతో సింగిల్‌గా పోటీ పడుతున్న మస్క్

## స్పేస్ఎక్స్ ఐపీఓ సృష్టించిన సునామీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆధునిక పారిశ్రామిక ప్రపంచంలో అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ మరో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన వ్యక్తిగత సంపద ఇప్పుడు ప్రపంచంలోని కొన్ని ప్రధాన దేశాల మొత్తం జీడీపీలను సైతం అధిగమించడం అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర చర్చనీయాంశమైంది. అంతరిక్ష పరిశోధనా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎలాన్ మస్క్ సంస్థ 'స్పేస్ ఎక్స్'.. యూఎస్ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో 75 బిలియన్ డాలర్ల పబ్లిక్ ఆఫరింగ్ నిధులను సేకరించింది. ఈ మెగా ఐపీఓ దెబ్బతో మస్క్ సంపద అమాంతం పెరిగిపోయింది. దీంతో మస్క్ అధికారికంగా ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రిలియనీర్ గా అవతరించారు. ప్రస్తుతం



ఆయన మొత్తం ఆస్తుల విలువ 1.1 ట్రిలియన్ డాలర్లకు (1,100 బిలియన్ డాలర్లు లేదా సుమారు రూ. 103 లక్షల కోట్లు) చేరుకుంది. ఒక వ్యక్తి ఆస్తులు ఏకంగా ఒక సార్వభౌమ దేశ ఆర్థిక వ్యవస్థను దాటిపోవడం ప్రపంచ ఆర్థిక చరిత్రలోనే ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

**ఐఎంఎఫ్ గణాంకాల ప్రకారం వివిధ దేశాల జీడీపీలతో మస్క్ సంపదను పోలిక ఇలా ఉంది:**


- తైవాన్: సెమీకండక్టర్ల తయారీలో ప్రపంచ కేంద్రంగా పేరొందిన తైవాన్ దేశ వార్షిక జీడీపీ 976.7 బిలియన్ డాలర్లు. అంటే, ఆ దేశం ఒక ఏడాదిలో సృష్టించే మొత్తం ఆర్థిక విలువ కంటే మస్క్ వ్యక్తిగత ఆస్తే ఎక్కువ.
- నెదర్లాండ్స్ & టర్కీ: ఈ సంపన్న దేశాల జీడీపీ అంచనా సుమారు 1.1 ట్రిలియన్ డాలర్లు. మస్క్ ప్రస్తుత సంపద (1.1 ట్రిలియన్ డాలర్లు) ఈ దేశాల మొత్తం ఆర్థిక వ్యవస్థల పరిమాణంతో సమానంగా ఉంది.
- సౌదీ అరేబియా: చమురు నిల్వలకు కేరాఫ్ అడ్రస్ అయిన సౌదీ అరేబియా జీడీపీ సుమారు 1.05 ట్రిలియన్ డాలర్లు. ఎలాన్ మస్క్ ఆస్తుల విలువ ఈ దేశ ఆర్థిక వ్యవస్థ కంటే కూడా ఎగువన ఉండటం విశేషం.

వివాదాలు, విజయాల నడుమ దూసుకుపోతున్న ఎలాన్ మస్క్.. తాజా స్పేస్ఎక్స్ ఐపీఓతో వ్యాపార ప్రపంచంలో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచారు.

# మళ్లీ ఎగబాకిన పసిడి, వెండి ధరలు..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక పరిణామాలతో గత కొన్ని రోజులుగా కాస్త తగ్గుముఖం పట్టిన బంగారం, వెండి ధరలు శుక్రవారం మార్కెట్లో ఒక్కసారిగా పుంజుకున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు శాంతించడంతో ఈ విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. దీని ప్రభావంతో దేశీయ విపణిలోనూ ధరలు రోదసి వైపు పరుగెత్తాయి. హైదరాబాద్‌లో పసిడి, వెండి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరాయి. ఒక్కరోజులోనే ధరలు భారీగా పెరగడం మార్కెట్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర క్రితం రోజుతో పోలిస్తే ఏకంగా రూ.3,000 పైగా పెరిగి రూ.1,52,200 కు చేరింది. బంగారంతో పోటీ పడుతూ తెల్ల బంగారం కూడా ఆకాశాన్ని తాకింది. ఒక్క రోజే దాదాపు రూ.9,000



మేర పెరిగి కిలో వెండి ధర రూ.2.49 లక్షలు పలికింది.

# పెట్రోల్ బంకుల్లో బల్క్ ఇంధనంపై ఆంక్షలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం కీలక ఆంక్షలు విధించింది. ఇకపై పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, భారీ కంపెనీలు సాధారణ పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో (బల్క్) ఇంధనాన్ని కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది.

**ఆంక్షలకు ప్రధాన కారణాలు**

- ధరల వ్యత్యాసం: బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ బంకుల్లో లభించే ధర కంటే చాలా ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, ఢిల్లీలో బంకుల్లో లీటర్ డీజిల్ ధర రూ.95.20 ఉండగా, బల్క్ కొనుగోలుదారులకు ఇది రూ.134.50 గా ఉంది. ఈ భారీ వ్యత్యాసం వల్ల వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు సాధారణ బంకుల బాట పట్టాయి.
- అంతర్జాతీయ పరిస్థితులు: పశ్చిమాసియాలో ఉద్రి



క్తతల కారణంగా ముడిచమురు సరఫరా, షిప్పింగ్ వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఇది దేశీయ ఇంధన లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని కేంద్రం అంచనా వేసింది.

**కొత్త నిబంధనలు :** ఒక వినియోగదారుడికి లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్‌ను మాత్రమే బంకుల్లో విక్రయించాలి.

**కంటైనర్ నిబంధన:** 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే ఇంధనాన్ని సరఫరా చేయాలి.

**నిషేధం:** ఇలా కొనుగోలు చేసిన ఇంధనాన్ని తిరిగి విక్రయించడం పూర్తిగా చట్టవిరుద్ధం.

**రాష్ట్రాలకు ఆదేశాలు:** అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, ఇంధన మళ్లింపు వంటి అనధికారిక కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత లేకుండా చూడటమే ప్రధాన లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వచ్చి, తొలుత 90 రోజుల పాటు కొనసాగుతాయి. పరిస్థితులను బట్టి, అవసరమైతే ఈ గడువును మరో ఉత్తర్వుతో పొడిగించే అవకాశం ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ గుడ్‌బై

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ జరుగుతున్న సమయంలోనే అతడు ఈ అనూహ్య నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన విలియమ్సన్, గతేడాదే టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాడు. తాజాగా మిగతా రెండు ఫార్మాట్ల (టెస్టులు, వన్డేలు) నుంచి కూడా తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించాడు.

**ఘనమైన రికార్డులు ఇవే..**

35 ఏళ్ల కేన్.. కివీస్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో 19 వేలకు పైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉండటం విశేషం. 2016 నుంచి 2024 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు న్యూజిలాండ్ జట్టుకు విజయవంతంగా సారథ్యం వహించాడు. రెండుసార్లు జట్టును ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్ కు చేర్చడంతో పాటు, తొలి ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతగా కివీస్‌ను నిలపడంలో కేన్ కెప్టెన్సీదే కీలక పాత్ర. తన రిటైర్మెంట్ నిర్ణయంపై విలియమ్సన్ స్పందిస్తూ.. "ఆటకు వీడ్కోలు పలకడంపై గత కొన్ని రోజులుగా ఆలోచిస్తూనే ఉన్నా. ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెట్ పట్ల నాకు ఎప్పుడూ బలమైన తపన, ఆసక్తి ఉండేవి. న్యూజిలాండ్ తరఫున ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా సర్వశక్తులూ ఒడ్డాను. ఆ భావనే నన్ను గర్వపడేలా చేస్తోంది. ఇలాంటి గొప్ప జట్టుకు నాయకత్వం వహించడమూ ఆనందంగా ఉంది. నా మనసులో ఎప్పుడూ జట్టుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇన్నేళ్లూ ఈ టీమ్‌లో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా" అని ఉద్వేగంగా తెలిపాడు. కేన్ విలియమ్సన్ కేవలం న్యూజిలాండ్ ప్లేయర్‌గానే కాకుండా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల క్రికెట్ అభిమానులకు అత్యంత ఆప్తుడయ్యాడు. గతంలో ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించిన అతడు, జట్టును ఏకంగా ఫైనల్ వరకూ చేర్చాడు. 2016లో కప్పు గెలిచిన ఛాంపియన్ జట్టులోనూ అతడు కీలక సభ్యుడే. ఐపీఎల్‌లో మొత్తం 79 మ్యాచ్‌లు ఆడిన కేన్ 2,128 పరుగులు సాధించాడు. తెలుగు ఫ్యాన్స్ ఎంతో అభిమానంగా పిలుచుకునే 'కేన్ మామ' వీడ్కోలు వార్త అభిమానులను నిరాశపరుస్తోంది.

**క్రీడాస్ఫూర్తికి మారుపేరు.. కోహ్లీకి ఆప్తమిత్రుడు**

క్రికెట్ మైదానంలో ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉండే కేన్‌ను జెంటిల్‌మన్ క్రికెటర్‌గా అభివర్ణిస్తారు. ప్రత్యర్థులను గౌరవించడంలో ముందుండే కేన్, ఇతర ఆటగాళ్లతో గొడవపడిన సందర్భాలు దాదాపు శూన్యం. ఇక టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి, కేన్‌కు అండర్19 రోజుల నుంచే మంచి స్నేహం ఉంది. ఆ ఆత్మీయ బంధం ఇప్పటికీ అలాగే కొనసాగుతుండటం విశేషం.



# లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్

## ఒకే రోజు రూ.9.7 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా-ఇరాన్ మధ్య త్వరలోనే శాంతి ఒప్పందం కుదరబోతోందన్న సానుకూల వార్తలు ప్రపంచ దేశాలతో పాటు భారత స్టాక్ మార్కెట్లలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు దిగిరావడంతో దేశీయ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 1,700 పాయింట్ల మేర లాభపడగా, నిఫ్టీ 23,600 మార్క్ ను దాటి దూసుకెళ్లింది. మార్కెట్ల ఉధృతితో దలాల్ స్ట్రీట్ శుక్రవారం కళకళలాడింది. ఉదయం నుంచే కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఉదయం 74,709.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,832.55) భారీ లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, ఇంట్రాడేలో 75,608.02 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1,695.40 పాయింట్ల లాభంతో 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 461.30 పాయింట్ల లాభాన్ని మూటగట్టుకుని 23,622.90 వద్ద స్థిరపడింది. మార్కెట్ల దూకుడుతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒకే రోజులో రూ.9.7 లక్షల కోట్లు పెరిగింది. దీంతో మొత్తం మార్కెట్ క్యాప్ రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఎటర్నల్ షేర్లు పెట్టుబడిదారులకు కాసుల వర్షం కురిపించాయి. ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు మాత్రమే స్వల్ప నష్టాలను చవిచూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 95.11 వద్ద ముగిసింది.

డైనమిక్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం 'క', 'కెర్యాంప్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ల తర్వాత అలరించారు. 'ఎస్ఆర్ కళ్యాణమండపం' సంచలన విజయంతో తన రైటింగ్ ట్యాలెంట్ ని ఇప్పటికే చాటుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కు హీరోగా, కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాతగా అరంగేట్రం చేస్తున్న ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతోంది. అనౌన్స్ మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. భారీ గంగాళం, మంటలు, పొగల మధ్య బ్యాక్ సైడ్ నుంచి కనిపిస్తున్న కిరణ్ అబ్బవరం సంప్రదాయ గ్రామీణ యువకుడి గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ వేడుకల వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ పోస్టర్, ఈ చిత్రాన్ని కూడా ఒక ప్రత్యేక విందులా ఎంతో శ్రద్ధతో రూపొందిస్తున్నామనే ఫీలింగ్ కలిగిస్తోంది. ట్యాగ్‌లైన్ మరింత ఆసక్తికరంగా మార్చింది.



# కిరణ్ అబ్బవరం చిత్రం
# రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఈ చిత్రంతో దేవికా భట్ తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. సీనియర్ నటులు శరత్ కుమార్, సాయి కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యూత్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం, నటీనటులు హాజరైన ఒక భారీ పూజా కార్యక్రమంతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవం అనంతరం వెంటనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. తొలి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొంటోంది. దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే కిరణ్ అబ్బవరం పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేశారు. ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలతో పాటు తనలోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విశ్వాస్ డేనియల్ డీవోపీ వ్యవహరిస్తుండగా, వరుస విజయాలతో దూసుకెళ్తున్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సంతోష్‌నాయుడు ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. వరుస విజయాలతో జోరుమీదున్న కిరణ్ అబ్బవరం, తొలిసారి మెగాఫోన్ పట్టడం, అలాగే భారీ స్థాయిలో నిర్మాణం జరగడం వల్ల ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.

# 'జైలర్ 2'కోసం..



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2' గురించి ఒక సంచలన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపిస్తారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే.. 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. ఈ బాలీవుడ్ స్టార్‌కి సంబంధించిన కీలక సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో చిత్రీకరించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ అటు నార్త్ ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మోహన్‌లాల్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ ఏడాది చివర్లోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ప్రేమ డైరీలో చివరి పేజీలు..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో టాలీవుడ్ స్క్రీన్‌పైకి ఓ బ్యూటీఫుల్ మూవీ రాబోతోంది. పి.వి. అర్జున్ యాదవ్ అదితి జంటగా, శ్రీ ప్రసన్న హనుమాన్ వెంకటేశ్వర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పి.వి. నరసింహ యాదవ్ నిర్మాణంలో, హరికృష్ణ పామంజి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫీల్ గుడ్ లవ్ స్టోరీ 'ప్రేమ డైరీలో చివరి పేజీలు'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, విడుదలకు ముస్తాబవుతోంది. ప్రముఖ ఆడియో సంస్థ మ్యాంగో మ్యూజిక్ ద్వారా ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని లిరికల్ సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అర్మాన్ మెరుగు అందించిన మెలోడీ ట్యూన్స్, క్యాచీ లిరిక్స్ సంగీత ప్రియులను అలరిస్తూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. పాటలకు వస్తున్న ఈ అద్భుతమైన రెస్పాన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ సినిమాతో పి.వి. అర్జున్ యాదవ్ హీరోగా గ్రాండ్‌గా పరిచయం అవుతున్నారు. సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్, ఆయన నటన ప్రేక్షకులను ఎమోషనల్ జర్నీకి గురిచేస్తాయి. లవ్, ఎమోషన్స్ కలబోసిన ఈ కథలో అర్జున్ యాదవ్ తన నటనతో, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ తో ప్రేక్షకులను కట్టిపడేయనున్నాడు. మొదటి సినిమా అయినప్పటికీ ఎంతో పరిణతి ఉన్న నటుడిగా, ఒక వైపు లవర్ బాయ్‌గా.. మరోవైపు ఎమోషనల్ సీన్స్ లో జీవించేసి చిత్రానికి మెయిన్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈ సినిమాతో టాలీవుడ్‌లో ఆయనకు హీరోగా మంచి బ్రేక్ లభించడం ఖాయంగా కనిపిస్తోంది. అర్జున్ యాదవ్ సరసన హీరోయిన్‌గా అదితి నటించగా, వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు హైలైట్‌గా నిలవనుంది. మ్యాంగో మ్యూజిక్ ద్వారా విడుదలైన లిరికల్ సాంగ్స్ ఇప్పటికే చార్ట్ బస్టర్స్ గా నిలిచి సినిమా ప్రమోషన్స్ కు భారీ మైలేజ్ తెచ్చిపెట్టాయి. ప్రేమ, భావోద్వేగాలు, మరిచిపోలేని జ్ఞాపకాల సమాహారంగా దర్శకుడు హరికృష్ణ పామంజి ఈ చిత్రాన్ని అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించారు. ప్రతి ఒక్కరినీ క్లైమాక్స్ వరకు కదలకుండా కూర్చోబెట్టేలా ఈ 'చివరి పేజీలు' సాగుతాయని చిత్రయూనిట్ చెబుతోంది. తేజ అందించిన సినిమాటోగ్రఫీ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో అందంగా, రిచ్‌గా చూపించబోతోంది.

# 'ఆల్ఫా' టీజర్ వైరల్



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

యశ్ రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తోన్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో మరో హీరోయిన్ శార్వరి కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీని గ్లోబల్ హిట్ సిరీస్ 'రైల్వే మెన్' ఫేమ్ శివ్ రవైల్ తెరకెక్కిస్తున్నారు. అనీల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జూలై 3న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ కాబోతున్నట్లుగా తెలుపుతూ మేకర్స్ బుధవారం చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఆలియా భట్ యాక్షన్‌కు అంతా ఫిదా అవుతున్నారు. 'వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్' వస్తోన్న ఈ మూవీ టీజర్ ని 'ది ఫస్ట్ కిల్' పేరుతో మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్‌ని గమనిస్తే.. యాక్షన్ స్టార్ బాబీ డియోల్.. వ్యక్తులను చంపటానికి శిక్షణ ఇచ్చి పెంచి పెద్ద చేసిన ఓ హంతకురాలి కథతో ఈ సినిమా రూపొందుతున్నట్లుగా ఫస్ట్ షాట్‌లోనే మేకర్స్ తెలియజేశారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా బలమైన తండ్రికూతుళ్ల సెంటిమెంట్, ఒక ఇంటెన్స్ ఒరిజిన్ స్టోరీగా ఈ చిత్రాన్ని మలిచినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. 'ఇండియా నెక్స్ట్ జనరేషన్ సోల్జర్స్'ను తయారుచేసే ఒక సీక్రెట్ ప్రోగ్రామ్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందనే విషయం టీజర్‌లో క్లారిటీ ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి. 'ఈ ప్రపంచంలో కేవలం రెండు రకాల మనుషులే ఉంటారు.. ఒకటి వోల్ఫ్ (తోడేలు), రెండు షీప్ (గొర్రె).. నేను వోల్ఫ్‌ని' అని బాబీ డియోల్ హెచ్చరిస్తే.. 'వోల్ఫ్ కూతురు వోల్ఫే అవుతుంది సార్' అంటూ ఆలియా భట్ ఇచ్చే కౌంటర్ అండ్ యాక్షన్ సీన్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఆలియా భట్ తన 18వ పుట్టినరోజున ఫస్ట్ మిషన్‌కు వెళ్లడం, చైల్డ్ హుడ్ నుంచి ఆమెకు ఇచ్చిన కఠినమైన ట్రైనింగ్ షాట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తున్నాయి. టీజర్ చివరలో వచ్చే యాక్షన్ కట్, గన్ షాట్స్, 'ఆల్ఫా' లోగో డిజైన్ పక్కా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో ఉన్నాయి. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మొదటి లేడీఓరియంటెడ్ క్రేజీ యాక్షన్ ఫిల్మ్ కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మిస్టరీ థ్రిల్లర్!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దేశీ హిట్ ఉమెన్‌గా హ్యూమా ఖురేషీ నటిస్తున్న చిత్రం 'బేబీ డూ డై డూ' మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి నచికేత్ సామంత్ దర్శకుడు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ విషయాన్ని తరణ్ ఆదర్శ్ ఎక్స్ వేదికగా తెలిపారు. టీజర్‌లో హ్యూమా ఖురేషీ 'బేబీ కర్‌మార్కర్' అనే ఆసక్తికరమైన పాత్రలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. భారతీయ సినీ తెరపై తొలి దేశీ హిట్ ఉమన్‌గా ఆమె పాత్రను రూపొందించినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. సస్పెన్స్, థ్రిల్, డార్క్ హ్యూమర్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లనుందని మేకర్స్ చెబుతున్నారు. సాకిబ్ సలీమ్ నిర్మిస్తున్న ఈ సినిమా జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

> అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా 'దడక్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది జాన్వీ కపూర్. ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే స్టార్ డమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, సక్సెస్ ఫెయిల్యూర్లతో ఏమాత్రం సంబంధం లేకుండా హిందీ, తెలుగు భాషల్లో వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది. టాలీవుడ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని గట్టిగానే ప్రయత్నిస్తోంది. అయితే, తెలుగులో ఆమె చేస్తున్న ప్రయాణం ఆశించినంత సాఫీగా సాగడం లేదు.



# ఇక బాలీవుడే టార్గెట్ !

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తెలుగులో తన తొలి అడుగు కోసం జాన్వీ ఏరికోరి ఎంచుకున్న ప్రాజెక్ట్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర'. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రంలో తంగం పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో నటనకు ఆస్కారం ఉన్న సన్నివేశాల కంటే గ్లామర్ షోకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో విమర్శల పాలైంది. ఆమె గ్లామర్ పై సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో ట్రోలింగ్ నడిచింది. సినిమా ఆశించిన విజయం సాధించినా, తంగం పాత్ర మాత్రం జాన్వీ కెరీర్‌కు పెద్దగా ప్లస్ కాలేదనే చెప్పాలి. 'దేవర' వివాదం మరువకముందే, ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్లో వచ్చిన 'పెద్ది' సినిమా వంతు వచ్చింది. ఈ సినిమాలో జాన్వీ అచ్చియమ్మ అనే విలేజ్ గర్ల్ పాత్రలో నటించింది. 'దేవర'లో ఎదుర్కొన్న విమర్శలు ఒక ఎత్తు అయితే, పెద్ది సినిమాలో అచ్చియమ్మ పాత్రకు వస్తున్న నెగెటివిటీ మరో ఎత్తు. పల్లెటూరి వాతావరణానికి, ఆమె గ్లామర్ డోస్ శృతి మించడంతో, సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను సైతం రిలీజ్ అయ్యాక తొలగించేశారు. ఈ నిర్ణయానికి దర్శకుడు బుచ్చిబాబు పూర్తి బాధ్యత తీసుకున్నప్పటికీ, నెటిజన్ల నుంచి జాన్వీకి మాత్రం ట్రోలింగ్ తప్పలేదు. ఇక అసలు విషయానికి వస్తే.. ఈ సినిమా కోసం జాన్వీ తీసుకున్న పారితోషికం ఇప్పుడు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. దేవర సినిమా కోసం 5 కోట్ల రూపాయల భారీ రెమ్యునరేషన్ అందుకున్న ఈ బ్యూటీ, రామ్ చరణ్ సినిమా కోసం ఏకంగా 8 కోట్లకు పైగా డిమాండ్ చేసిందట. సినిమాలో అచ్చియమ్మ పాత్ర నిడివి చాలా తక్కువే ఉన్నప్పటికీ, గట్టిగా 10 సన్నివేశాల్లో కూడా పూర్తిగా కనిపించని ఓ పాత్ర కోసం ఏకంగా 8 కోట్లు సమర్పించుకోవడంపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలోనే చర్చ జరుగుతోంది. దర్శక నిర్మాతలు జాన్వీ గ్లామర్ ఇమేజ్ కోసమే ఇన్ని కోట్లు కుమ్మరిస్తున్నారా అంటూ నెటిజన్లు ఘాటుగా స్పందిస్తున్నారు. వరుస విమర్శలు, ట్రోలింగ్స్ నేపథ్యంలో ప్రస్తుతం టాలీవుడ్‌లో జాన్వీకి కొత్త ఆఫర్లు రావడం దాదాపు తగ్గిపోయాయనే వాదన బలంగా వినిపిస్తోంది. భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేయడం, దానికి తగ్గట్టుగా పాత్రలకు స్కోప్ లేకపోవడంతో నిర్మాతలు కూడా వెనకడుగు వేస్తున్నారట. దీంతో తెలుగులో ప్రస్తుతానికి అవకాశాలు జీరో స్థాయికి పడిపోవడంతో, జాన్వీ తన దృష్టిని పూర్తిగా తిరిగి బాలీవుడ్ ప్రాజెక్టుల పైకే మళ్లించినట్లు తెలుస్తోంది. మరి రాబోయే రోజుల్లో తన నటనతో విమర్శకుల నోళ్లు మూయించి, సౌత్ ఇండస్ట్రీలో తిరిగి సత్తా చాటుతుందా లేదా అనేది వేచి చూడాలి.

-ఎం.డి అబ్దుల్



# శత్రువులతో పోరాటం!

## జూలై 30న 'స్పైడర్-మ్యాన్'

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారతీయ అభిమానులకు ఒక రోజు ముందుగానే థియేటర్లలో సందడి చేయనుంది. మొదట ప్రకటించిన తేదీ కంటే ఒక రోజు ముందుగా, ఈ చిత్రం జూలై 30, 2026న భారతదేశంలో విడుదల కానుంది. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అలాగే, భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ ఈ నెల17 నుంచి ప్రారంభం కానున్నాయి. విడుదలైన ట్రైలర్ ఇప్పటికే చరిత్ర సృష్టిస్తూ 1 బిలియన్ వ్యూస్‌ను దాటిన తొలి సినిమా ట్రైలర్‌గా రికార్డు నమోదు చేయడం విశేషం. దాదాపు ఐదేళ్ల తర్వాత టామ్ హాలండ్ మరోసారి స్పైడర్‌మ్యాన్ పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. 'స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్' సంఘటనల తర్వాత నాలుగేళ్లు గడిచిన నేపథ్యంలో, తనకు అత్యంత ప్రియమైన వారందరి జ్ఞాపకాల నుంచి తాను స్వచ్ఛందంగా మాయమైన పీటర్ పార్కర్ జీవితాన్ని ఈ చిత్రం ఆవిష్కరించనుంది. న్యూయార్క్ నగరాన్ని కాపాడేందుకు పూర్తిగా స్పైడర్‌మ్యాన్‌గా మారిన అతడు ఎదుర్కొనే సరికొత్త సవాళ్లు, శక్తివంతమైన శత్రువులతో పోరాటం కథలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. డెస్టిన్ డేనియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టామ్ హాలండ్‌తో పాటు జెండయా, జేకబ్ బటలాన్, జాన్ బెర్న్థల్, సాడీ సింక్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో 2డీ, 3డీ మరియు అన్ని ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**